




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 252, పేజీలు - 08

గురువారం, ఫిబ్రవరి 26, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






## గ్రేటర్ హైదరాబాద్‌లో కల్తీ పాల కలకలం



- అధికారుల కనుసైగల్లో నడుస్తున్న అక్రమ దందా.?
- అధికారుల దాడులు లేకపోవడంతో రెచ్చిపోతున్న మాఫియాలు
- ఆహార కల్తీ చట్టం కాగితాలకే పరిమితమా.?

(గౌటీ రామకృష్ణ - ప్రశ్న న్యూస్)

గ్రేటర్ హైదరాబాద్ నగర పరిధిలో కల్తీ పాల దందా రోజురోజుకు విస్తరిస్తున్నా, సంబంధిత అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరేతనట్లు వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కల్తీ పాలు సేవించి ప్రజలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు తాజాగా దేశవ్యాప్తంగా ఆందోళన రేకెత్తించగా, గ్రేటర్ హైదరాబాద్‌లో కూడా పరిస్థితి అలగే ఉందన్న ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. నగర శివారు ప్రాంతాలతో పాటు నగర మధ్యలో అక్కడక్కడ గుర్తు చప్పుడు కాకుండా కల్తీ పాలు తయారుచేసి విక్రయించడం జరుగుతుందని దీనిపైన టాస్క్ ఫోర్స్ దాడులు లేకపోవడంతో కల్తీ రాయుళ్లు యదేచ్ఛగా తమ వ్యాపారాన్ని విస్తరిస్తూ మూడు పువ్వులు ఆరు కాయలుగా నడిపిస్తున్నారు.

### విచ్చలవిడిగా కల్తీ పాల సరఫరా..

నగర పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో నాసిరకం పాలు, రసాయనాలతో కలిపిన కల్తీ పాలు బహిరంగంగానే సరఫరా అవుతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. తెల్లవారుజామున ఇంటింటికీ చేరుతున్న పాలలో నాణ్యతపై అనుమానాలు ఉన్నప్పటికీ, ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ మాత్రం కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. కొన్ని డెయిరీ ఫారంల పేరు పెట్టుకుని విక్రయాలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పలు రాష్ట్రాలకు సంబంధించిన పాలను సైతం విక్రయిస్తున్నారు. ఈ పాల నాణ్యత ఎంత.? వాటి ప్రమాణం ఎంత.? ఏ డెయిరీ పాలు ఎంత ప్రమాణంలో కల్తీ అవుతున్నాయో.? లేదో అన్నదానిపై ప్రతిరోజు పరీక్షలు నిర్వహించాల్సిన అధికారులు పరీక్షలు చేస్తున్నారా.? చేస్తే ఎందుకు మీడియా ముఖంగా సమాచారాన్ని ప్రజలకు అందించడం లేదు.? గోప్యంగా ఉంచడం వెనక అంతర్యం ఏమిటి.? కల్తీ పాల సరఫరా చేస్తున్న డెయిరీ ఫారలతో అధికారులకు అంతర్గత ఒప్పందాలు ఉన్నాయా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఫుడ్ సేఫ్టీ, పోలీసుల దాడులు ఎక్కడ.?

తెలంగాణ రాష్ట్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు కొన్ని రోజులు అడాహుడి చేసి తర్వాత అడ్రస్ లేకుండా పోయారని, దీని వెనుక పెద్ద రాజకీయ స్కెచ్ ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఫుడ్ సేఫ్టీ అధికారులు చేసే తనిఖీలు సేకరించిన శాంపిల్స్ లతో పరీక్షలు నిర్వహించిన తర్వాత వచ్చిన ఫలితాలను మాత్రం బహిరంగంగా వ్యక్తపరచకపోవడం వెనక లంచాలే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసు విభాగాలు తరచూ దాడులు చేస్తున్నామంటున్న ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడం లేదని వినియోగదార సంఘాలు అంటున్నాయి.

### అంతా గోప్యం ఎందుకు.?

ఎన్ని నమూనాలు సేకరించారు.? ఎన్ని కేసులు నమోదు చేశారు.? ఎన్ని కేంద్రాలు మూసివేశారు.? అన్న వివరాలు ప్రజలకు వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికారుల కను సైగల్లో కేంద్రాలా.? కొన్ని ప్రాంతాల్లో కల్తీ పాల తయారీ కేంద్రాలు బహిరంగ రహస్యంగా నడుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికుల ఫిర్యాదులు ఉన్నప్పటికీ చర్యలు లేకపోవడం వెనుక అధికారుల నిర్లక్ష్యమా, లేక మౌన అంగీకారమా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని కల్తీ మాఫియా కేంద్రాలపై జర్నలిస్టులు దాడులు చేసి పట్టుకుంటే పోలీసులు మాఫియాకు సహకరించి రిపోర్టర్ల పైనే అక్రమ కేసులు పెట్టడంతో రిపోర్టర్లు సైతం మాఫియాల అవినీతి అక్రమాలపై దృష్టి పెట్టలేకపోతున్నారు. ఒకవేళ ఎవరైనా ధైర్యం చేసి వెళ్లిన పోలీసులు మాత్రం వాళ్లనే టార్గెట్ చేయడం పరిపాటిగా మారుతుంది.

### రేవంత్ రెడ్డి సర్కార్ మరిచిందా.?

తెలంగాణ రాష్ట్రంలో ప్రజారోగ్యం కీలక అంశమని పదేపదే ప్రకటిస్తున్న ప్రభుత్వం, కల్తీ ఆహారంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా పాలు వంటి నిత్యావసర ఆహార పదార్థంలో కల్తీ జరగడం అత్యంత ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు అనుమానాస్పద పాల కేంద్రాలు, ఆహార పదార్థాల విక్రయాల పై ఆకస్మిక దాడులు చేయాలని కల్తీ నిర్ధార అయితే వారిపై కఠిన శిక్షలు వేయాలని నాణ్యత పరీక్షల నివేదికలను ప్రజలకు ఎప్పటికప్పుడు వెల్లడించాలని ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే కల్తీ పాల మాఫియాపై ప్రభుత్వం వెంటనే ఉక్కుపాదం మోపాలని నగర వాసులు కోరుతున్నారు. లేకపోతే మరిన్ని విషాదాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

## ఎన్‌సీఈఆర్టీ తీరుపై విమర్శలు

- తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- ఆ అంశాన్ని తొలగించాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఎనిమిదో తరగతి సిలబస్‌లో ' న్యాయవ్యవస్థలో అవినీతి ' ఓ పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. జాతీయ విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్టీ) తీరుపై సుప్రీంకోర్టు మండిపడింది. ఇది అందర్నీ కలవరానికి గురిచేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను సహించబోమని తేల్చిచెప్పింది. న్యాయస్థానం ఏ సంస్థను, ఏ

2లో..

## దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు

- భక్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి వెల్లివిరుస్తుందన్న జగన్

2లో..



## జూన్‌లో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభిస్తాం

- మార్కాపురంలో పలు కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు
- వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపుపై కలియతిరుగుతూ ప్రసంగం
- వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీరు అందిస్తామని హామీ



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాలో పర్యటించారు. మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించిన తర్వాత ఆయన ఇక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కు సంబంధించి కీలకమైన అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద సుమారు రూ. 456 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఫీడర్ కెనాల్ లైనింగ్ మరియు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ ప్రజావేదిక బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. గత ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టును అసంపూర్తిగా వదిలేసి, పనులు పూర్తికాకుండానే

2లో..

## సీఎం రేవంత్ రెడ్డితో శంతను నారాయణ్ భేటీ

- ఉద్యోగాలపై ఏఐ, నైపుణ్యాభివృద్ధి, కొత్త అవకాశాలపై చర్చ
- ప్రభుత్వపరంగా ఏం చేయాలనే అంశాలపై వారి మధ్య చర్చ
- రాష్ట్రాన్ని తయారీ కేంద్రంగా నిలబెట్టడానికి చర్యలు తీసుకోవాల్సి ఉందన్న సీఎం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ కలిశారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డితో శంతను నారాయణ్ భేటీ కావడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ గురించి రేవంత్ రెడ్డి, శంతను నారాయణ్ చర్చించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ బోర్డు సభ్యుడిగా కూడా శంతను నారాయణ్ కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కొత్త అవకాశాలు, గ్లోబల్ ట్రెండ్స్‌పై వారిద్దరూ చర్చించారు. వివిధ

2లో..

## నా అన్వేషణ యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు

- త్వరలో భారత్‌కు రావాల్సిందే!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 'నా అన్వేషణ' యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అతడు వీడియో విడుదల చేశాడంటూ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి పంజాగుట్ట పోలీసులు ఈ నోటీసులు జారీ చేశారు. విశాఖపట్నంకు చెందిన అన్వేష్ విదేశాల్లో ఉంటూ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. భక్తుల

2లో..

## పసికందు హంతకులకు అండగా నిలబడ్డ ప్రతి ఒక్కరు దోషులే

- కుమ్మెర జాతర ఘటనపై కేటీఆర్ ఆగ్రహం

- చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కేటీఆర్ డిమాండ్
- సమాజం తలదించుకోవాల్సిన ఘటన జరిగిందన్న కేటీఆర్
- నిందితులను కాపాడే ప్రయత్నం సిగ్గుమాలిన చర్య అన్న కేటీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సమాజం మొత్తం ఆవేదనతో తలదించుకునే దుర్మార్గమైన సంఘటన కుమ్మెరలో జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో మృతిచెందిన చిన్నారి కుటుంబాన్ని కేటీఆర్ బుధవారం పరామర్శించారు. నాగర్‌కర్నూల్‌లోని అంబేడ్కర్ కూడలిలో కుమ్మెర గ్రామస్థులు చేపట్టిన ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, స్థానిక ఎంపీ కుమ్మెర గ్రామంలో పసిపాప ప్రాణాలు తీసిన హంతకులకు అండగా నిలబడుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై ప్రభుత్వం,

2లో..

## మూసీ సుందరీకరణ పనులు.. నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ

- వద్దనుకుంటే గేటెడ్ కమ్యూనిటీల్లో ఫ్లాట్లు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంగతి తెలిసిందే. మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా 3200 ఎకరాలు సేకరించనున్నట్లు గెజిట్ నోటిఫికేషన్‌లో సర్కార్ పేర్కొంది. 10 వేల నిర్మాణాలు ప్రభావితం అవుతాయని తెలిపింది. ఈ ప్రాజెక్టులో

2లో..

## పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం

- ఉద్యోగాల కల్పనపై మంత్రి లోకేష్ కీలక ప్రకటన



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసి, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం 'క్లస్టర్ బేస్డ్' విధానంతో ముందుకు వెళ్తోందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సూపర్-6 హామీల్లో భాగంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనపై ప్రభుత్వ ప్రణాళికను ఆయన వివరించారు. ఈ కొత్త

2లో..

## పింఛన్ల పెంపు, మహిళలకు సాయం

- బడ్జెట్‌లో రేవంత్ సర్కార్ కసరత్తులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుండగా ఎన్నికల హామీల్లో

2లో..

## ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం

- మోదీ గొప్ప స్నేహితుడన్న నెతన్యాహు



జెరూసలేం / న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఇజ్రాయెల్ పార్లమెంటులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఉగ్రవాదంపై పోరులో అండగా ఉంటామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు హామీ

2లో..

## ముంబైలోని అనిల్ అంబానీ నివాసం జప్తు

- పాల్ హిల్ నివాస ఆస్తిని తాత్కాలికంగా జప్తు చేసిన ఈడీ
- 17 అంతస్తులతో 66 మీటర్ల ఎత్తు ఉన్న విలాసవంత భవనం
- ఇప్పటి వరకు అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.15,700 కోట్లు



2లో..

ప్రజాప్రశ్న



# ఎన్సీఈఆర్టీ తీరుపై విమర్శలు

వ్యక్తిని కించపరచడానికి అనుమతించదని, ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. కొన్ని రోజులు ఆగితే దీనిపై సుమోటోగా విచారణ చేపడతామని పేర్కొన్నారు. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు దృష్టికి సీనియర్ న్యాయవాది, ఎంపీ కపిల్ సిబల్ తీసుకొచ్చారు. ఎన్సీఆర్టీ 8వ తరగతిలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించి బోధిస్తోందని వివరించారు. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం నుంచి స్పందన వచ్చింది. సుప్రీంకోర్టు స్పందన నేపథ్యంలో పాఠ్య పుస్తకం నుంచి ఈ అంశాన్ని ఎన్సీఈఆర్టీ తొలగించనున్నట్టు ఉన్నతస్థాయి ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. "దీనిని చేర్చి ఉండకూడదు అటువంటి అంశాలను హైలైట్ చేయడం సముచితం కాదు బదులుగా స్ఫూర్తిదాయకమైన విషయాలు పొందుపరిచి ఉండాల్సింది" కేంద్ర ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. న్యాయవ్యవస్థలో అవినీతి, దుష్ప్రవర్తన ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయని, ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ జులై 2025లో చేసిన వ్యాఖ్యలను పాఠ్యాంశంలో ప్రస్తావించారు. "ప్రజలకు విశ్వాసం కల్పించడానికి పారదర్శకత, జవాబుదారీతనం ప్రజాస్వామ్య ధర్మాలు" అని ఆయన అన్న వ్యాఖ్యలను పుస్తకంలో ఉటంకించారు. సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసిన కొద్దిసేపటికే ప్రభుత్వ వర్గాలు ఈ అంశంపై స్పందించాయి. 'ఎన్సీఆర్టీ 8వ తరగతి పాఠ్య పుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి అనే అంశాన్ని పాఠంగా జోడించింది. మరి మంత్రులు, ప్రజా సేవకులు,దర్యాప్తు సంస్థలు సహా రాజకీయ నాయకులు భారీ అవినీతి సంగతి ఏంటి? వాటిని ఎందుకు పక్కనబెట్టాలి' అని కపిల్ సిబల్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అయితే, కాగా, కొద్ది రోజుల కిందట 2016 నుంచి 2025 మధ్య సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులపై సుప్రీంకోర్టుకు 7,520 ఫిర్యాదు అందినట్టు న్యాయశాఖ నివేదిక విడుదల చేయడం గమనార్హం. దీనిపై సీనియర్ అభిషేక్ మను సింఘ్వీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతర రంగాల్లో అవినీతిని పక్కనబెట్టి కేవలం న్యాయవ్యవస్థనే వేలెత్తి చూపుతున్నారని మండిపడ్డారు. పాఠశాల స్థాయిలో విద్యలో పిల్లలకు విద్యావంతులను చేయాల్సింది పోయి ఇలాంటి సంక్లిష్టమై అంశాలను చేర్చడం ఏంటి? అని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా ప్రశ్నించారు. 8వ తరగతిలో, విద్యార్థులకు పాలనా విభాగాలు, వాటి విధులను పరిచయం చేయడమే ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన అన్నారు.

# దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు

కడప **(ప్రశ్న న్యూస్)** కడప జిల్లా వేంపల్లె మండలం నందిపల్లి గ్రామంలోని నందీశ్వర ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో వైసీపీ అధినేత జగన్ పాల్గొన్నారు. శివ నామస్మరణతో మారుమోగుతున్న ఆలయ ప్రాంగణంలో జగన్ సంప్రదాయ దుస్తులు ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన హోమాలు, ప్రత్యేక అభిషేకాల్లో ఆయన భక్తిశ్రద్ధలతో పాలుపంచుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం గావించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ దేవాలయాలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. "భక్తి మార్గం ద్వారానే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల పునర్నిర్మాణం జరగడం వల్ల ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. నందిపల్లిలో ఈ మహోత్సవాన్ని ఒక పండగలా నిర్వహించడం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని ఆయన ప్రశంసించారు. కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ ఛైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డిని, ఇతర సభ్యులను జగన్ ప్రత్యేకంగా అభినందించారు. నందీశ్వర స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలతో పాటు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నా అన్వేషణ యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు

మనోభావాలు దెబ్బతీసేలా అతడు కొద్ది రోజుల క్రితం వీడియోను విడుదల చేశాడు. ఈ క్రమంలో ప్రముఖ సినీ నటి కరాటే కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తాజాగా లుకౌట్ నోటీసులు జారీ చేశారు. వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఇటీవల అన్వేష్ అకౌంట్‌ను ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్ చేసింది. తన ఖాతాను ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్ చేయడాన్ని అన్వేష్ తేలిగ్గా తీసుకున్నాడు. తనకు యూట్యూబ్ ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు వస్తున్నాయని ఈ ఖాతా పోతే తనకు వచ్చే నష్టమేమీ లేదని తెలిపాడు. ఆయన మరో ఇన్‌స్టాగ్రామ్ ఖాతాతో పాటు యూట్యూబ్‌ను కూడా బ్లాక్ చేయాలని పోలీసులు లేఖ రాయనున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డితో శంతను నారాయణ్ భేటీ

రంగాల్లో ఏఐతో ఉద్యోగాలపై పడే ప్రభావం, గ్రీన్ ఎనర్జీ, రాష్ట్ర ప్రభుత్వం పరంగా చేపట్టాల్సిన పలు చర్యలు సహా పలు అంశాలపై వారిద్దరి మధ్య లోతైన చర్చ జరిగినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవడంపై శంతను నారాయణ్‌తో సీఎం రేవంత్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తెలంగాణను ఏఐ మాన్యుఫ్యాక్చరింగ్ పవర్?గా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. అందుకోసం కొన్ని కీలక సంస్థలను ఆకర్షించేలా ప్రణాళికలు తయారు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన చర్యలను రేవంత్ రెడ్డికి శంతను నారాయణ్ వివరించారు. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, స్కిల్లింగ్, రీస్కిల్లింగ్? వంటి అంశాలపై రేవంత్ రెడ్డికి, శంతను నారాయణ్ చర్చించారు. ఆర్థిక వ్యవస్థపై ఏఐ రెవల్యూషన్ ప్రభావం.. రానున్న రోజుల్లో ఏఐని మరింత సమర్థంగా ఉపయోగించుకునే అంశాలపై శంతను నారాయణ్?తో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. తెలంగాణను అభివృద్ధిలో మరింత ముందుకు నడిపించేందుకు సహకరించాలని ఈ సందర్భంగా శంతను నారాయణ్‌ను సీఎం కోరారు. ఇక ఇటీవలె ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సులో హాజరై ప్రసంగించిన రేవంత్ రెడ్డి.. కేంద్ర, రాష్ట్రాల్లో ఏఐ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రపంచ టెక్నాలజీలో ఏఐ రాకతో సమూల మార్పులు వచ్చాయని తెలిపారు. ఏఐని ఉపయోగించడం, దాన్ని నియంత్రించడం, ఏఐకి సంబంధించిన మార్గదర్శకాలు, ఏఐతో జాతీయ భద్రత వంటి అంశాల కోసం ఈ ఏఐ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు.

# జూన్‌లో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభిస్తాం

రిబ్బన్ కటింగ్ చేసి ప్రజలను మోసగించిందని ఆయన విమర్శించారు. ఫీడర్ కాలువ పటిష్టతపై దృష్టి పెట్టకపోవడం వల్ల అనేక చోట్ల గండ్లు పడి ప్రాజెక్టుకు ముప్పు ఏర్పడిందని, అందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు మంజూరు చేసి యుద్ధప్రతిపాదికన పనులు చేపడుతోందని వివరించారు. వెలిగొండ ప్రాజెక్టును తన మానస పుత్రికగా అభివర్ణించిన చంద్రబాబు, 1996లో తాను ఇచ్చిన హామీ మేరకే దీనికి శంకుస్థాపన చేశానని గుర్తు చేసుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను ఒక సవాల్‌గా స్వీకరిస్తున్నాను అని ఆయన ప్రకటించారు. ఆగస్టు 2026 నాటికి ప్రాజెక్టు పనులను పూర్తి చేసి నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను మళ్లించడమే తమ లక్ష్యమని, దీని కోసం సుమారు రూ. 2,000 కోట్లు అవసరమవుతాయని అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. దేవుడి ప్రసాదాన్ని కల్తీ చేసి ఆ తప్పును హెరిటెజ్ పై రుద్దేందుకుప్రయత్నిస్తున్నారని జగన్, వైసీపీ తీరుపై మండిపడ్డారు. పర్యటనలో భాగంగా జిల్లా అభివృద్ధిపై పలు వరాలు కురిపించారు. మార్కాపురం ప్రాంతాన్ని పీడిస్తున్న ప్రధాన సమస్య అయిన ఫ్లోరైడ్ రక్కసిని తరిమికొట్టేందుకు రక్షిత మంచినీటి పథకాలను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొత్త జిల్లాగా ఏర్పడిన మార్కాపురంలో మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. నదుల అనుసంధానం ద్వారా ఈ వెనుకబడిన ప్రాంతానికి సాగునీరు అందించి, రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు రాకతో మార్కాపురం జిల్లా కేంద్రం పసుపుమయంగా మారింది. జిల్లా నలుమూలల నుండి భారీ ఎత్తున తరలివచ్చిన ప్రజలు, రైతులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు.

# ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం

ఇచ్చారు. మోదీ మాట్లాడుతూ, ఉగ్రవాదానికి తాము పూర్తి వ్యతిరేకమని, భారత్ దశాబ్దాలుగా ఈ సమస్యతో ఇబ్బందిపడుతోందని అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించిన తొలి ప్రధానిని తానేనని, దీనిని గొప్ప గౌరవంగా భావిస్తున్నానని మోదీ అన్నారు. భారత్, ఇజ్రాయెల్ ప్రాచీన నాగరికత కలిగిన దేశాలని తెలిపారు. ఉగ్రవాదాన్ని సహించే పరిస్థితి లేదని అన్నారు. హమాస్ దాడి చేసి పౌరులను చంపడం దారుణమని అన్నారు. ఇజ్రాయెల్‌కు అనేక అంశాల్లో భారత్ అండగా నిలుస్తోందని మోదీ తెలిపారు. హమాస్ దాడుల తర్వాత మీ బాధలను భారత్ పంచుకుందని అన్నారు. ఉనికి కోసం యూదులు చాలా కష్టపడ్డారని పేర్కొన్నారు. ఉగ్రవాదం విషయంలో ఏ దేశమైనా ద్వంద్వ వైఖరిని విడనాడాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. చర్చలకు భారత్ ఎప్పుడూ సిద్ధమని, తాము శాంతిని కోరుకునే వాళ్లమని అన్నారు. ఇజ్రాయెల్ అందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని తాము మరిచిపోలేమని అన్నారు. యూదులు ఉనికి కోసం అనేక కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. రక్షణ, భద్రత విషయంలో రెండు దేశాల మధ్య ఒప్పందాలు జరిగాయని తెలిపారు. ఇజ్రాయెల్ సాయంతో భారత్ వ్యవసాయ రంగంలో సరికొత్త మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రధాని మోదీకి స్వాగతం పలికిన అనంతరం ఆ దేశ ప్రధాని నెతన్యాహు మాట్లాడారు. మోదీ ఇజ్రాయెల్ పర్యటన ఎంతో సంతోషకరమని, ప్రపంచ దేశాల్లో మోదీ గొప్ప నాయకుడని ప్రశంసించారు. తనకు మోదీ స్నేహితుడికంటే ఎక్కువ అన్నారు. మోదీ నేతృత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి సాధిస్తోందని అన్నారు. అనేక సమయాల్లో ఇజ్రాయెల్‌కు భారత్ అండగా నిలబడిందని గుర్తు చేసుకున్నారు.

# పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం

విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించినట్లు లోకేశ్ తెలిపారు. రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, కడప-చిత్తూరుల్లో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్, నెల్లూరులో గ్లాస్, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైసెస్ వంటి క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒకే చోట ప్రధాన పరిశ్రమలతో పాటు వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ యూనిట్లను నెలకొల్పడం ద్వారా బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించడమే తమ లక్ష్యమని వివరించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో తయారయ్యే ప్రతి 100 ఏసీలలో 50 మన రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నాయని, డైకిన్, ఎల్జీ వంటి కంపెనీలు తమకు అవసరమైన కోర్సులను ఐటీఐలలో ప్రవేశపెట్టాలని కోరాయని చెప్పారు. పరిశ్రమల భాగస్వామ్యంతో కోర్సుల కరిక్యులమ్ మార్చి, యువతకు నాణ్యమైన శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్, న్యాక్ ద్వారా 73,000 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 40,000 మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలు సులభంగా కల్పించేందుకు 'నైపుణ్యం' పేరుతో ఒక వినూత్న పోర్టల్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు లోకేశ్ వెల్లడించారు. ప్రపంచంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత టెక్నాలజీతో ఈ పోర్టల్ పనిచేస్తుందని, దీని ద్వారా యువత తమ నైపుణ్యాలను స్వయంగా అంచనా వేసుకోవచ్చని, రెస్యూమ్ తయారు చేసుకోవచ్చని, ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకోవచ్చని వివరించారు. ఏఐ ట్యూటర్ ద్వారా ఇంటర్వ్యూలకు కూడా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పటివరకు నిర్వహించిన 1,587 జాబ్ మేళాల ద్వారా 1,08,747 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. నిర్మాణ రంగంలో ప్రపంచస్థాయి కార్మికులను తయారు చేసేందుకు న్యాక్‌ను 90 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన బలోపేతం చేస్తామని మంత్రి లోకేశ్ సభకు హామీ ఇచ్చారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేసి ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించడమే తమ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

## మూసీ సుందరీకరణ పనులు..

# నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ

భాగంగా నార్సింగి పరిధిలోని మధు పార్కు రిడ్జ్ అపార్ట్‌మెంట్‌వాసులు ఇళ్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో వారికి మెరుగైన ప్యాకేజీ ఇచ్చేందుకు సర్కార్ రెడీ అయింది. అపార్ట్‌మెంట్ మొత్తాన్ని సేకరిస్తుండటంతో రెండు విధాలా వారికి పునరావాసం కల్పించేందుకు జిల్లా ఇంఛార్జ్ మంత్రులు ఆలోచించినట్లు తెలిసింది. తమ ఆలోచనలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన మరికొన్ని సూచనలు ఇచ్చారట. మధు పార్కు రిడ్జ్ అపార్ట్‌మెంట్‌లో మొత్తం 420 ఫ్లాట్లు ఉన్నట్లు తేలింది. వారిలో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ యజమానులకు రూ.60లక్షల నుంచి రూ.70 లక్షల ప్యాకేజీ, ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ యజమానులకు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకూ ప్యాకేజీ ఇచ్చే ఛాన్స్ ఉందట. ఈ డబ్బులు తీసుకోని పక్షంలో 11 గేటెడ్ కమ్యూనిటీల్లో నచ్చినచోట ఫ్లాట్లను ఇప్పించనున్నట్లు తెలిసింది. నార్సింగి పరిధి టిప్పుఖాన్ బ్రిడ్జి సమీపంలోని మధు పార్కు రిడ్జ్ అపార్ట్‌మెంట్ ప్రస్తుతం బఫర్‌జోన్‌లో ఉందని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. మొత్తం 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ అపార్ట్‌మెంట్ ఉండగా.. అందులో 2.5 ఎకరాలు బఫర్ పరిధిలో ఉందని చెప్పారు. కాగా, మూసీ నదికి రెండువైపులా 50 మీటర్ల వరకు మాత్రమే స్థలాలను అధికారులు తెలిపారు. ఇతర వదంతులు నమ్మొద్దని సూచించారు. భూసేకరణ నోటిఫికేషన్‌తో అపార్ట్‌మెంట్ వాసులు ఒక్కసారిగా ఆందోళనకు గురి అవుతున్నారని ప్రభుత్వం వారి అంగీకారంతోనే ఆస్తుల స్వాధీన ప్రక్రియను ప్రారంభిస్తుందని తెలిపారు. బఫర్ జోన్‌లో నిర్మాణాలను స్వాధీనం చేసుకొని తగిన నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాజేంద్రనగర్, గండిపేట మండలాల్లో 85 ఎకరాలను స్వాధీనం చేసుకోనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆస్తుల స్వాధీనంపై ఇంకా సర్వేను ప్రారంభించలేదని అన్నారు.

# పసికందు హంతకులకు అండగా నిలబడ్డ ప్రతి ఒక్కరు దోషులే

ముఖ్యమంత్రి మౌనంగా ఉండటం సరికాదని అన్నారు. మల్లన్న స్వామి జాతరలో దేవుడికి దండం పెట్టుకునే అవకాశం అడిగితే, ఆ కుటుంబంపైన తీవ్రంగా దాడి చేసి మానవత్వానికే మచ్చ తెచ్చారన్నారు. 21వ శతాబ్దంలో కూడా కులాలు మతాల పేరిట ఒకరిని చిన్నగా చూడటం, అవమానించడం, అధికారాన్ని అండగా పెట్టుకుని హత్యా రాజకీయాల్ని, హత్య చేసిన హంతకులను కాపాడే ప్రయత్నం జరగడం నిజంగా సిగ్గుచేటని అన్నారు. ఈరోజు పసిపాప హంతకులకు అండగా నిలబడ్డ ప్రతి ఒక్కడు దోషే అని అన్నారు.

హంతకుడు ఎవరైనా, ఏ పార్టీకి చెందిన వారైనా వారిని జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన 8 మంది పైన ముమ్మాటికి హత్యానేరం కింద కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని అన్నారు. పసిపాపను హత్య చేసిన వారి పైన చర్యలు తీసుకోవడంతో పాటు, ఆ కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పసిపాపను హత్య చేసిన హంతకులను శిక్షించి జైల్లో వేయాలని, అవసరమైతే ఉరిశిక్ష వేయాలి కానీ బయటకి వదలవద్దని కోరారు. ప్రభుత్వం అధికారం అడ్డం పెట్టుకుని పోలీసులతో ఈ హత్యను తప్పుదోవ పట్టిస్తుందని కేటీఆర్ ఆరోపించారు. ఇంత అమానవీయమైన సంఘటన జరిగితే ప్రభుత్వం, ముఖ్యమంత్రి మౌనంగా ఉండడం క్షమించరాని నేరం అన్నారు. నేడు తాను ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా, ఒక తండ్రిగా, సమాజంలోని ఒక వ్యక్తిగా ఈ కుటుంబానికి అండగా నిలబడేందుకు వచ్చినట్లు కేటీఆర్ తెలిపారు. ఈరోజు పసిపాప ప్రాణాలు పోయిన తీరు మాటలకు అందని మహా విషాదమని కేటీఆర్ అన్నారు. ఇంతటి అమానవీయమైన సంఘటన జరిగినప్పుడు రాజకీయాలు మాట్లాడవలసిన అవసరం లేదని అన్నారు. కానీ ఆ కుటుంబానికి న్యాయం జరిగేదాకా పోరాటం చేయాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అన్నారు. మీడియా, రాజకీయ నాయకులు, ప్రజలు ప్రతి ఒక్కరు కూడా ఈ పోరాటంలో ఆ కుటుంబానికి అండగా నిలబడాల్సిన అవసరం ఉందని చెప్పారు. బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని, వారికి పది లక్షలతో ఇల్లు కట్టిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు.

# పింఛన్ల పెంపు, మహిళలకు సాయం

మిగిలిన మరిన్ని హామీలను అమలు చేసే దిశగా చర్యలు చేపట్టింది. 2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని ఎన్నికల హామీలను అమలు చేయగా మరికొన్ని ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. అయితే అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 6 గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించినా రాష్ట్ర ఖజానాలో డబ్బు లేకపోవడం వల్ల అన్నీ అమలు చేయలేక పోతున్నామని తెలిపింది.

ఈ నేపథ్యంలోనే మార్చి 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు తెలంగాణ బడ్జెట్ సమావేశాలు జరగనుండగా 20న తేదీన రేవంత్ రెడ్డి సర్కార్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే ఈ బడ్జెట్‌లోనే పింఛన్ల పెంపు, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయంపై ప్రకటన ఉండొచ్చనే వార్తలు ఇప్పుడు తీవ్ర ఆసక్తికరంగా మారాయి. మరోవైపు ఆసరా పెన్షన్లలో భాగంగా పింఛన్లను వృద్ధులకు రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ తెలిపింది. అయితే ఇప్పటివరకు మాత్రం ఈ హామీ అమలు కాలేదు. దీంతో పింఛన్ పెరుగుతుందని భావిస్తున్న వారంతా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు పింఛన్ల పెంపునకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదిక కూడా అందించింది.

ప్రస్తుతం రూ.2 వేలు ఇస్తున్న వృద్ధాప్య పెన్షన్లను రూ.4 వేలకు, దివ్యాంగుల పెన్షన్లకు రూ.6 వేలకు పెంచితే ఇప్పుడు అయ్యే ఖర్చు కంటే రాష్ట్ర ఖజానాపై ఎంత అదనపు ఖర్చు అవుతుందనే దానిపై సమగ్ర రిపోర్టును అందించింది. ఆ నివేదికకు అనుగుణంగా త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. మరోవైపు మహాలక్ష్మి పథకం లో భాగంగా రాష్ట్రంలో 18 ఏళ్లు దాటి అర్హులైన మహిళలు అందరికీ ప్రతీ నెలా రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో వెల్లడించింది. దీనికి సంబంధించి కూడా ఈ బడ్జెట్‌లోనే ప్రకటన వెలువరించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే ఈ మహాలక్ష్మి పథకం అమలుకు నిధుల అందుబాటుపై ఆర్థిక శాఖ సీఎం రేవంత్ రెడ్డికి నివేదికలు కూడా అందించింది. దీనిపై బడ్జెట్‌లో ప్రకటన చేయనున్నారని సమాచారం. ఇక బడ్జెట్ సమావేశాలకు ముందు కేబినెట్ భేటీలో ఈ పథకాల అమలుపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు పథకాలతోపాటు విద్యార్థులకు ఫ్రీ ల్యాప్ టాప్‌లు అందించే పథకంపైనా రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంటుందని సమాచారం.

# ముంబైలోని అనిల్ అంబానీ నివాసం జప్తు

ముంబై (ప్రశ్న న్యూస్) మనీల్యాండరింగ్ కేసులో రియలెన్స్ సంస్థ అధినేత అనిల్ అంబానీకి మరో షాక్ తగిలింది. ముంబయిలోని రూ.3,716 కోట్ల విలువైన ఆయన విలాసవంతమైన నివాసాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ( ఈడీ ) అటాచ్ చేసింది. అనిల్ అంబానీ కి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ బ్యాంకు మోసం ఆరోపణల కేసు విచారణలో భాగంగానే ఈ భవనాన్ని జప్తుచేయడానికి తాత్కాలిక ఉత్తర్వు జారీచేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి ముంబయిలోని పాలి హిల్ సమీపంలో ఉన్న అనిల్ అంబానీ నివాసం 17 అంతస్తులతో 66 మీటర్ల ఎత్తైన భవనం. ఇదే సమయంలో ఫిబ్రవరి 26 విచారణకు హాజరుకావాలని ఇప్పటికే అనిల్ అంబానీకి ఈడీ సమన్లు జారీచేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇది వరకే ఒకసారి ఆయన ఈడీ విచారణకు హాజరయ్యారు. ఆగస్టు 2025లో ఆయన స్టేట్‌మెంట్‌ను ఈడీ రికార్డు చేసింది. సుప్రీంకోర్టు సూచనలతో అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్‌పై వచ్చిన బ్యాంకు మోసం, ఆర్థిక అవకతవకలపై దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని ఈడీ ఏర్పాటుచేసింది. విచారణలో భాగంగా ఇప్పటి వరకూ ఈ కేసులో రూ.12 వేల కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసి, మూడు ఎఫ్ఐఆర్‌లు ఫైల్ చేసింది. రిలయన్స్ గ్రూప్ కంపెనీ అయిన రిలయన్స్ కమ్యూనికేషన్స్‌పై రూ.40,000 కోట్ల రుణ ఎగవేతపై విచారణ జరుగుతోంది. అయితే, కేసు విచారణలో దర్యాప్తు సంస్థల జాప్యంపై గతవారం సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. దర్యాప్తును వేగవంతం చేయాలని ఈడీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)లను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ విచారణ సమయంలో కోర్టు అనుమతి లేకుండా తాను విదేశీ పర్యటనకు వెళ్లబోనని అంబానీ హామీ ఇచ్చారు. అలాగే, అనిల్ భార్య టీనా అంబానీకి కూడా సమన్లు జారీ అయ్యాయి. గతవారం ఆమె ఈడీ విచారణకు గైర్హాజరయ్యారు. న్యూయార్క్‌లో విలాసవంతమైన భవనం కొనుగోలు కేసులో ఆమెకు సమన్లు జారీ చేశారు. రిలయన్స్ మాజీ ఎగ్జిక్యూటివ్ పునీత్ గార్గ్‌ను అరెస్టు చేసిన ఈడీ.. 2023లో ఆ ఆస్తిని మోసపూరితంగా విక్రయించిందని తెలిపింది.

# ప్రభుత్వ స్థలం ఆక్రమణ

## - బద్వేలు ఆర్డీవోకు ఫిర్యాదు

**బద్వేలు** బద్వేల్ పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న గోపవరం మండలం సంఘ సముద్రం గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి కేటాయించిన ప్రభుత్వం సర్వేనెంబర్ 1122-2లో సుమారు 05 సెంట్లు స్థలానికి కేటాయించిన నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి దర్గాగా ఫౌండేషన్ వేస్తున్న వైనం.రెవెన్యూ అధికారులు స్పందించి చూచిక బోర్డు ఏర్పాటుచేసిన అయితే నాకేంటి బోర్డును సైతం తొలగించి అక్రమ నిర్మాణం ఏర్పాటు చేస్తున్న వైనం.ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకోవడం కొత్త కాదు..ఇటువంటి చట్టాలు చాలా చూశాం అనుకున్నాడేమో ఆక్రమదారుడు. ఈ విషయంపై కొందరు వ్యక్తులు బద్వేలు ఆర్డిఓ చంద్రమోహన్ కు బుధవారం ఫిర్యాదు చేశారు

## ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద

# నిషేధాజ్ఞలు అమలు

## - వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్** ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణ లో భాగంగా సెక్షన్ 163 ఃబీఃూ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు తెలిపారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మొత్తం 94 పరీక్ష కేంద్రాల్లో (హన్మకొండ 52, వరంగల్ 24, జనగామ 16) తేది 25-02-2026 నుండి 18-03-2026 వరకు ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని సీపీ తెలిపారు. 1. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు. 2. సభలు, సమావేశాలు, ర్యాలీ లు, ధర్నాలు నిషేధం. 3. పరీక్ష కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది 25-02-2026 నుండి 18-03-2026 వరకు ప్రతిరోజూ ఉదయం 06:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు మూసివేయాలని సీపీ ఆదేశించారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని సీపీ హెచ్చరించారు.

## కలియుగ దైవం జోలికి వెళితే

# అదే గతి పడుతుంది

## - టిటిడి మాజీ బోర్డు సభ్యులు "బక్కని నర్సింహులు" సంచలన వ్యాఖ్యలు

## - హిందూ ధర్మం పట్ల తండ్రి వైఎస్, కొడుకు జగన్ ది అదే దారి

కేవలం లాభాపేక్షతోనే కాకుండా, హిందూ ధర్మం పట్ల ఉన్న వ్యతిరేకతతోనే ఒక సిండికేట్‌గా ఏర్పడి తిరుపతి పవిత్ర లడ్డూను కల్తీ చేశారని ఈ మహా పాపం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ను ఊరికే వదిలిపెట్టదని తప్పకుండా శిక్ష అనుభవించక తప్పదని తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ బోర్డు సభ్యుడు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు సుంచలన వ్యాఖ్యలు చేశారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో బక్కని స్థానిక మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన తిరుమల లడ్డూ కల్తీ ఉదంతాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహాపాపంగా అభివర్ణిస్తూ అసెంబ్లీలో ఆధారాలతో సహా సమగ్ర వివరాలు వెల్లడించారనీ బక్కని గుర్తు చేశారు. దాదాపు 20 కోట్ల కల్తీ లడ్డూలను భక్తులకు పంపిణీ చేసి, కోట్ల మంది హిందువుల విశ్వాసాలతో ఆడుకున్నారని, ఇది కేవలం అవినీతి మాత్రమే కాదని, వ్యవస్థీకృత నేరమని బక్కని మండిపడ్డారు. ఐదేళ్లలో సుమారు 60 లక్షల కిలోల కల్తీ నెయ్యిని నిబంధనలకు విరుద్ధంగా సేకరించి, రూ. 231 కోట్లకు దోచేశారని సీఎం లెక్కలతో సహా నిరూపించారన్నారు. కేవలం లాభాపేక్షతోనే కాకుండా, హిందూ ధర్మం పట్ల ఉన్న వ్యతిరేకతతోనే ఒక సిండికేట్‌గా ఏర్పడి ఈ కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్‌డీడీబీ నివేదిక ద్వారా బయటపడిన ఈ వాస్తవాలను గత పాలకులు తొక్కిపెట్టే ప్రయత్నం చేశారని, ఆ భగవంతుడి సంకల్పం వల్లే ఈ నిజం నేడు బయటపడిందని బక్కని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కుంభకోణంపై సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు సిట్ విచారణ కొనసాగుతోందని, అక్రమార్కులు ఎంతటి వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారన్నారు. కేవలం లడ్డూ కల్తీ మాత్రమే కాకుండా, గత ఐదేళ్ల టీటీడీ పాలనలో జరిగిన ఇతర అక్రమాలను వెలికితీసేందుకు ఒక ఏకసభ్య కమిటీని నియమించినట్లు బక్కనీ ఈ సందర్భంగా మీడియాకు వెల్లడించారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా చేసి, తిరుమల పవిత్రతను కాపాడటమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతని ఆయన పునరుద్ఘాటించారు. తిరుమల ఆలయ గౌరవ మర్యాదలను కాపాడేందుకు భవిష్యత్తులో అత్యంత కఠినమైన చట్టాలను తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారనీ, తిరుమలను మళ్లీ ఆధ్యాత్మిక కేంద్రంగా పూర్వవైభవం తీసుకువస్తామని భరోసా ఇచ్చారు.

# తెలంగాణలో క్షీణిస్తున్న శాంతి భద్రతలు

## - డీజీపీకి బీజేపీ వినతి పత్రం



**హైదరాబాద్** రాష్ట్రంలో శాంతిభద్రతలు అడుగంటాయి., హిందూ సమాజంపై వరుస దాడులు జరుగుతున్నాయని తెలంగాణ బీజేపీ నేతలు బుధవారం నాడు డీజీపీ శివధర్ రెడ్డిని కలిసి బిజెపి పక్షాన వినతిపత్రం నమర్పించారు. బాన్సువాడలో హిందువులపై అక్రమ కేసులు బనాయించడం, కామారెడ్డిలో బిజెపి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి, రుద్రూర్లో మహిళా న్యాయవాదిపై మతోన్మాదుల దౌర్జన్యం... ఇవన్నీ రాష్ట్రంలో అడుగంటిన చట్టబద్ధ పాలనకు ప్రత్యక్ష నిదర్శనాలని బీజేపీ రాష్ట్ర అధక్షుడు రామచంద్రరావు అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న 'ఓటు బ్యాంకు' మరియు 'బుజ్జగింపు' రాజకీయాల వల్లే రాష్ట్రంలో తీవ్రవాద, అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయి.నిందితులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని, రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో బిజెపి పక్షాన రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని డీజీపీ కి స్పష్టం చేశామని అయన అన్నారు.

## దేశానికి సేవ చేసే ఉద్యోగాలు పొందడం

# గర్వించదగ్గ విషయం



**పస్పిల్ మున్నా ఆత్మకూరు** చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తెలిపారు. ఆత్మకూర్ పట్టణానికి చెందిన అబ్దుల్ రషీద్ అనే విద్యార్థి ఆత్మకూర్ స్టేడియం లో ఉపేంద్ర అనే శిక్షకుడి దగ్గర ట్రైనింగ్ తీసుకొని బిఈ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సు లో ఉద్యోగం సాధించిన సందర్భంగా అతడిని స్థానిక ఆత్మకూర్ ఆూఖ రామంజి నాయక్, పట్టణ సీఐ మహేశ్వర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పస్పిల్ మున్నా మాట్లాడుతూ భారతదేశం తరపున ఆర్మీ లో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సు లో ఉద్యోగాలు పొంది దేశానికి సేవ చెయ్యడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆత్మకూర్ పట్టణం క్రీడలకు పుట్టినిల్లు అని తెలిపారు. ఆత్మకూర్ స్టేడియం లో ప్రతిఒక్కరికి క్రీడల పరంగా స్థానిక ఎమ్మెల్యే.శ్రీ.బుడ్డా రాజశేఖర్ రెడ్డి గారు అన్ని విధాలుగా సహకరిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా,ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ కోశాధికారి పఠాన్.నాగూర్ ఖాన్, స్టేడియం బాక్సింగ్ కోచ్ ఉపేంద్ర మరియు జాతీయ బాల్ బ్యాట్మింటన్ క్రీడాకారులు కరిముల్లా పాల్గొన్నారు

# తిన్న ఇంటి వాసాలే లెక్క పెట్టింది

**హైదరాబాద్** హబ్సిగూడలోని రిటైర్డ్ సైంటిస్ట్ ఇంట్లో అన్నం పెట్టిన ఇంటికే కన్నం వేసిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఓయూ ఏసిపి జగన్ తెలిపిన వివరాల ప్రకారం నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండలానికి చెందిన అల్లం తేజస్విని హబ్సిగూడ లోని గ్రీనిల్స్ కాలనీలో రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ పి ఎల్ కె ఎం రావు ఇంట్లో పని మనిషిగా విధుల్లో చేరింది. అయితే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అల్లం తేజస్విని ఇంట్లో ఉన్న బంగారాన్ని దొంగిలించి ఆర్థిక ఇబ్బందుల్లో నుంచి గట్టెక్కాలని నిశ్చయించుకుంది. ఈ నెల 23న ఇల్లు శుభ్రం చేస్తున్న సమయంలో ఇంటి యజమాని కళ్ళు కప్పి సుమారు 9 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించింది. అనుమానం వచ్చిన ఇంటి యాజమాని బీరువాను తీసి చూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో కంగారుపడ్డ ఇంటి యాజమాని ఓయూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దాంతో కేసు నమోదు చేసిన పోలీసులు కేవలం 36 గంటల్లో చాక చక్యంగా నిందితురాలని అరెస్టు చేసి, ఆమె దగ్గర్నుంచి 9 తులాల బంగారు ఆభరణాలతో పాటు, పదివేల రూపాయల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు. అనంతరం కేసును చాకచక్యంగా చేదించిన సిబ్బందికి ఏసీపీ జగన్ రివార్డును అందించి అభినందించారు.

## పసిపాప మృతికి కారుకులను

# కఠినంగా శిక్షించాలి

**హైదరాబాద్** నాగర్ కర్నూల్ లో పసిపాప మృతికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. 42శాతం బిసి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సమన్వయకర్త వేణు ఆధ్వర్యంలో ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్ వద్ద అగ్రవర్ణ పెత్తందారులకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థి నేతలు నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థి నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ ఎస్సీ ఎస్టీలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు.

బీసీలదే భవిష్యత్తు అని చెప్పుకుంటూ బీసీల పైన దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉస్మానియా యూనివర్సిటీ నుండి చలో నాగర్ కర్నూల్ పిలుపునిస్తామని తెలిపారు.

## లా పినోజ్ పిజ్జా రెస్టారెంట్‌లో

# బొద్దింకల కలకలం

**- వినియోగదారుడు ఆర్డర్ చేసిన పిజ్జాలో బొద్దింకల కలకలం....**

**హైదరాబాద్** ముసారం బాగ్ లో మెట్రో పిల్లర్ నంబర్ 1505 సమీపంలోని పిజ్జా రెస్టారెంట్ లో వినియోగదారుడు పిల్లల కోసం పిజ్జా ఆర్డర్ చేశాడు.పిజ్జా నుంచి బొద్దింకలు రావడం తో షాక్ కు గురైన వ్యక్తి ఇదేమిటి పుడ్ కోర్ట్ నిర్వాహకులను ప్రశ్నించాడు. నిర్వాహకులు నిర్లక్ష్యం గా వ్యవహరిస్తూ పొంతలేని సమాధానం చెప్పి తరవాత తప్పు జరిగింది అని ఒప్పుకున్నారు. ఆగ్రహం చెందిన బాధితుడు మీడియా కు పుడ్ సేఫ్టీ,పోలీసు అధికారులకు సమాచారం అందించారు.

## డయేరియా మరణాలపై

# ధర్మాన ఫైర్

**శ్రీకాకుళం,** శ్రీకాకుళం జిల్లాలో ప్రబలిన డయేరియా బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గత 20 నెలల కూటమి పాలనలో ప్రజారోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు ప్రజలకు శాపంలా మారాయని మండిపడ్డారు.అతిసార వ్యాధితో జిల్లాలో నలుగురు ప్రాణాలు కోల్పోతే, ప్రభుత్వం మాత్రం కేవలం ఒకరు లేదా ఇద్దరే చనిపోయారని అబద్ధపు లెక్కలు చెబుతోందని ధర్మాన ఆరోపించారు.

"వాంతులు, విరోచనాలతో ప్రజలుఅల్లాడుతుంటే, సహాయం చేయాల్సింది పోయి పోస్టుమార్టం నివేదికలంటూ కాలయాపన చేస్తున్నారు. గత డిసెంబర్‌లోనూ బలగ ప్రాంతంలో ఇలాగే డయేరియా విజృంభించినా ప్రభుత్వం పాఠాలు నేర్చుకోలేదు. ప్రస్తుతం 100 మందికి పైగా రోగులు ఆసుపత్రుల పాలయ్యారు. మంచి ప్రభుత్వం అని స్టిక్కర్లు వేసుకోవడంపై ఉన్న శ్రద్ధ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో లేదు" అని ధ్వజమెత్తారు.ప్రతి జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు అందించాలనే గత ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రైవేటీకరణ పేరుతో తుంగలో తొక్కారని ధర్మాన విమర్శించారు. రాజధాని పేరుతో డబ్బునంతా ఒకే చోట కుమ్మరిస్తూ, జిల్లాల అభివృద్ధిని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. సాగుకు యూరియా అందక రైతులు, ఇంగ్లీషు మీడియం చదువులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యానికి మద్దతు ధర లేకపోగా, క్వింటాల్‌కు రెండు కిలోల చొప్పున అదనంగా దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారుశ్రీకాకుళం అభివృద్ధి కోసం కనీసం వెయ్యి కోట్లు అయినా ఖర్చు చేశారా? అని ప్రశ్నించిన ఆయన... ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత మొదలైందని హెచ్చరించారు. ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

# టైక్వాండో పోటీల్లో సిల్వర్ మెడల్

## - ఆరుషికి సన్మానం

**హైదరాబాద్** నేపాల్ లోని ఖాట్మండులో జరిగిన మౌంట్ ఎవరెస్ట్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ టైక్వాండో ఛాంపియన్షిప్ల-2026 వేడుకలు ఘనంగా జరిగాయి దీనిలో భాగంగా ఫిబ్రవరి 19,20 తేదీలలో జరిగిన ఈవెంట్స్ లో కూకట్ పల్లి నిజాంపేటకు చెందిన నాగ సాయి ఆరుషి భారతదేశ నుండి జూనియర్ క్యురుగి మహిళా విభాగం 59 కేజీలు లో ఉత్తమ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడలో సాధించింది. 9వ తరగతి చదువుతున్న నాగ సాయి ఋషి ఎంత పెద్ద ప్రతిభను కనబరచడంతో వీరు యాదవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వాహకులు వీరు యాదవ్ ఆమెను ఘనంగా సత్కరించి ప్రోత్సాహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ లోని రామాలయం వీధిలో వీర్ భారత్ టైక్వాండో అకాడమీలో శిక్షణ తీసుకుంటూ ఇంత ప్రతిభ కనబరచడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహిస్తే భారతదేశానికి ఒలంపిక్స్ లో గోల్డ్ మెడల్ కూడా సాధించే సత్తా ఉంటుందని అన్నారు. దీనిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ అమ్మాయిని గుర్తించి కావాల్సిన సహాయ సహకారాలను అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రాబోయే ఈవెంట్స్ లో తప్పకుండా అమ్మాయికి అండగా నిలబడి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నాగసాయి ఆరుషి మాట్లాడుతూ ఒలంపిక్స్ లో భారతదేశానికి గోల్డ్ మెడల్ తీసుకొని రావడమే తన ముఖ్య లక్ష్మణ్ తనకు సహకరిస్తున్న కోర్సులతోపాటు తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

# దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధూపదీప నైవేద్యాలు పంపిణీ.

**సిరివెళ్ల** మండల పరిధిలోని కొన్ని దేవాలయాలను గుర్తించి దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యం దీపం వెలగాలని ఉద్దేశంతో దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధూప దీప నైవేద్యాలు పంపిణీ చేయడం జరిగిందని నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల నుండి దాతల సహకారంతో ఆంధ్ర ప్రదేశ్లో ఐదువేల దేవాలయాలకు దానా ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దీప దూప నైవేద్యాలు అందించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఈ మాసంలో కూడా దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సిరివెళ్ల మండలంలోని కొన్ని దేవాలయాలకు ధూపదీప నైవేద్యాలను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. గత ఏడు సంవత్సరాలు నుండి సుమారు 5000 దేవాలయాలకు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా గత సంవత్సరంలో సిరివెళ్ల మండలంలో దాదాపుగా 70 దేవాలయాలకు కార్తీకమాస సందర్భంగా ధూపదీప నైవేద్యాలను కూడా అందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ మహేష్ బి గితే.

**- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు**

**-163 'WSS (సెక్షన్ 144) అమలు**



**రాజన్న సిరిసిల్ల** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల సందర్భంగా సిరిసిల్ల పట్టణ కేంద్రంలోని జూనియర్ కలశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడుతున్న తీరును సమీక్షించి, కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 16 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా,అవాంఛనీయ ఘటనలు లేకుండా జరగడానికి 163 బీ ఎన్ ఎస్ ఎస్ (సెక్షన్ 144) అమలులో ఉంటుందని స్పష్టం చేశారు.పరీక్షల సమయంలో కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని,ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడ కుండా చూడలన్నారు.పరీక్షా కేంద్రం నుండి 200 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్లు ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి నిబంధనలు కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.ఈ పరిశీలనలో ఎస్పీ వెంట పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ సిబ్బంది ఉన్నారు.

# పునర్విక పాపకు అనాధ రక్షక్ సేవా ఫౌండేషన్ నుంచి ఆర్థిక సాయం అందజేత




**చాగలమర్రి** వెల్దుర్తి పట్టణములో పునర్విక అనే పసికందుకు ఎస్ ఎం ఏ టైప్ -1 అనే వ్యాధి సోకడంతో డాక్టర్లకు చూపిస్తే ఈవ్యాధి అరుదుగా వస్తుంది దీనికి ఇంజెక్షన్ వేయాలి అంటే దాదాపుగా పదహారు కోట్లు ఖర్చు అవుతుంది అని చెప్పడంతో సొమ్మసిలిపోయిన ఆ కుటుంబం ఆర్థిక సాయం కోసం ఎదురు చూపులు చూసింది.నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణములో నిత్యం సేవా చేసే యువకులు అనాధ రక్షక్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యములో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల , జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సాయం చేసిన 15వేల రూపాయలకు పైగా ఆర్థిక సాయం చేయనున్నారు అని త్వరలో వెల్దుర్తి లో పునర్విక కుటుంబాన్ని కలిసి ఆర్థిక సహాయం చేయనున్నారని దర్శన్ వల్లంకొండు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్పి కొండయ్య, మొండెం రమేష్ , అంగడి విశ్వనాథ్ , గిరీష్ , దుర్గం నవీన్ కుమార్ రెడ్డి , చైతన్య , తదితరులు పాల్గొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో మరో విషాదం

**అదిలాబాద్,** నిత్యం వివాదాలకు కేంద్రంగా నిలిచే నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో మరో విషాదం చోటుచేసుకుంది. ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న ఆర్. వసంత అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. గర్ల్స్ హాస్టల్‌లో విద్యార్థిని వసంత బలవన్మరణానికి పాల్పడినట్టు అధికారులు తెలిపారు. మృతురాలు వసంత స్వస్థలం వనపర్తి జిల్లాగా గుర్తించారు.ఈ ఘటన గురించి తెలుసుకున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది వనపర్తిలోని విద్యార్థిని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. వసంత ఆత్మహత్యకు కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆమె వ్యక్తిగత కారణాలతో ఈ తీవ్ర నిర్ణయం తీసుకుందా? లేక ఇతర ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు తరచూ జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.వసంత ఆత్మహత్యకు ప్రేమ విఫలం కావడం కారణమని వైరల్ అవుతోంది. ఆమె గణేష్ అనే యువకుడ్ని ప్రేమిస్తోందని, ఆ యువకుడు తన స్వగ్రామంలో ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం. అంతకుముందు తన ఫోన్, వాట్సాప్ లో వసంత నెంబర్ బ్లాక్ చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వసంత సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకుందని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు చెబుతున్నారు. అయితే పోలీసుల దర్యాప్తులో అసలు విషయాలు బయటకు రానున్నాయి.

# గ్రామాలలో ఆర్థిక అక్షరాస్యత పెరగాలి




**రాయచోటి** గ్రామాలలో ఆర్థిక అక్షరాస్యత పెరగాలని మెప్మా సీఎం అబ్బాస్ పేర్కొన్నారు.బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని మెప్మా కార్యాలయంలో గ్రామస్థాయిలో ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీలో ఆర్థిక అక్షరాష్యత కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఆర్థిక అక్షరాస్యత అనగా పొదుపులు ఎలా చేయడం ఖర్చులు మరియు అత్యవసర నిధి గురించి చెప్పడం జరిగినది సబ్ ఇన్స్పెక్టర్ చెన్రాయుడు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ మరియు సైబర్ ఫ్రాడ్ గురించి చెప్పడం జరిగినది ముఖ్యంగా సైబర్ ఫ్రాడ్ అనేది తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలి అనే ఉద్దేశంతో ఇలాంటి మోసాలు చేయడానికి అలవాటు పడతారని చెప్పడం జరిగినది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ సుజాత గారు మాట్లాడుతూ దీప్ అకౌంట్ గురించి చెప్పడం జరిగింద డీప్ అనగా బ్యాంకులో 10 సంవత్సరాలకు పైగా ఎటువంటి ఆర్థిక లాల్వాదేవిలు జరగని అకౌంట్ లో ఉన్న డబ్బుల డీప్ అకౌంట్ కు ట్రాన్స్ఫర్ అవుతాయి అటువంటి అమౌంటు ఉంటే బ్రాంచ్ కి వెళ్లి సరైన పత్రాలు చూపించి డ్రా చేసుకోవచ్చని చెప్పడం జరిగింది కెనరా బ్యాంక్ మేనేజర్ మస్తాన్ మాట్లాడుతూ కేవైసీ ఈ కేవైసీ తదితర అంశాల గురించి చెప్పడం జరిగినది.

స్టేట్ బ్యాంకు చీఫ్ మేనేజర్ మల్లేశ్వర్ రావు మాట్లాడుతూ డిజిటల్ ట్రాన్సాక్షన్ గురించి వివరంగా చెప్పడం జరిగినది . థర్డ్ పార్టీ ఏపీపీ లు వాడకుండా బ్యాంక ఏపీపీఎస్ ఉపయోగించుకుని సురక్షితమైన ఆర్థిక లావాదేవీలు జరుపుకోవాలని, అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజనకు 436 రూపాయలు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనకు 20 రూపాయలు సంవత్సరానికి ఒకసారి చెల్లించి కుటుంబ భవిష్యత్తుకు ఉపయోగపడేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పడం జరిగినది విడ్స్ కౌన్సిలర్ కవిత మాట్లాడుతూ సి కే వై ఈ మరియు రిస్క్ ల గురించి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెప్మ సీఎంఎం అబ్బాస్ అలీఖాన్ ఎస్బిఐ చీఫ్ మేనేజర్ మల్లేశ్వర్ రావు చెంద్రాయుడు సార్ కెనరా బ్యాంక్ మేనేజర్ మస్తాన్ ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ సుజాత సి ఓ లు లు రమణమ్మ మరియు నాగ మునేప్ప నాయుడు, విడ్స్ కౌన్సిలర్స్ ఆంజనేయులు తిరుమలయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ప్రత్యేక పూజల్లో వైఎస్ జగన్

**పులివెందుల** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన పులివెందులలో రెండో రోజు సాగింది. బుధవారం నాడు స్థానిక నందీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో జగన్ పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తుల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరిపై స్వామివారి కటాక్షం ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ప్రతినిధులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్చి3 తేదీన.పాక్షిక చంద్రగ్రహణం

**శ్రీశైలం** మార్చి 3 తేదీన.పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడనుంది. మార్చి తెల్లవారుజామున 4.30 నుంచి 6 గంటలోపు శ్రీశైల ఆలయంలో దర్శనాలు ఉంటాయి..తిరిగి రాత్రి 9 గంటలకు దర్శనాలు ప్రారంభమయి 10 గంటల వరకు ఉంటాయిమార్చి 3 న ఉదయం 6 గం.ల నుంచి రాత్రి 9 గం.ల వరకు శ్రీశైల దేవస్థానం దర్శనాలు నిలిపివేయడం జరుగుతుంది అన్ని ఉప ఆలయాలతో పాటుస్వామి అమ్మవారి దర్శనాలు నిలిపివేయడం జరుగుతుంది గ్రహణ అనంతరం సంప్రోక్షణ వివిధ కార్యక్రమాల అనంతరం తిరిగి దర్శనాలు ప్రారంభించడం జరుగుతుంది..గ్రహణ కాలం 3 గంటల 28 నిమిషాలు పాటు ఉన్నదిగ్రహణం మధ్యాహ్నం 3.20 కి మొదలై.. సాయంత్రం 6.48 కి ముగుస్తుంది

## చిన్నారుల శ్రేయస్సే లక్ష్యంగా

# నూతన భవన నిర్మాణానికి శ్రీకారం

**- బోయినిపల్లి ఏఎంసీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్**

**- ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో అంగన్వాడీ నూతన భవనానికి భూమిపూజ**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం అంగన్వాడీ కేంద్రం నూతన భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవతో శుభారంభం చేశారు.ఈ సందర్భంగా బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ "గ్రామీణ ప్రాంతాల్లో బాలల శ్రేయస్సు కోసం అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. చిన్నారుల పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడీలు బలమైన పునాది వేస్తాయి. బూరుగుపల్లి గ్రామానికి సొంత భవనం కల్పించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రత్యేకంగా కృషి చేయడం అభినందనీయం. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమవుతోంది. నిర్మాణం త్వరితగతిన పూర్తై చిన్నారులకు అందుబాటులోకి రావాలని ఆశిస్తున్నాము" అని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య--మహేష్,ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య,వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మండల నాయకులు కొలుపుల ప్రవీణ్, పలువురు గ్రామ సర్పంచులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ,అంగన్వాడీ సిబ్బంది,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి మల్లయ్య చేసిన సేవలు మరువలేం

- మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటాం
- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం
- 25 ఏళ్ల సేవలకు గౌరవంగా ప్రభుత్వం పక్షాన రూ.50 వేలు ఆర్థిక సహాయం
- మల్లయ్య కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ - ప్రగాఢ సంతాపం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని రత్నంపేట గ్రామ పంచాయతీలో గత 25 సంవత్సరాలుగా సిబ్బందిగా విధులు నిర్వహించిన ఎదురుగట్ల మల్లయ్య గత నెల 4వ తేదీన అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో చొప్పదండి శాసనసభ్యులు,కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లాధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన సేవలకు గౌరవంగా రూ.50,000ల ఆర్థిక సహాయాన్ని మల్లయ్య భార్య మల్లమ్మకు చెక్కు రూపంలో అందజేశారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మల్లయ్య గ్రామాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని, ఇలాంటి సేవాభావం ఉన్న సిబ్బందిని ప్రభుత్వం ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాప్రా ప్రెస్ క్లబ్ మూడు భాగాలుగా విభజన

-నూతన కమిటీలు ఏర్పాటుకు దారితీసిన పరిణామాలు



కాప్రా(ప్రశ్న న్యూస్)కాప్రా ప్రాంతంలో జర్నలిస్టుల సంఘటిత వేదికగా కొనసాగుతున్న కాప్రా ప్రెస్ క్లబ్ తాజాగా మూడు భాగాలుగా విభజించబడినట్లు సమాచారం. అంతర్గత వ్యవహారాలు, నాయకత్వ విభేదాలు, పరిపాలనా అంశాలపై అభిప్రాయ భేదాలు ఉత్పన్నమవడంతో ఈ విభజన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. టిఎస్ఐఐసీ కాలనీలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఒక వర్గం తమ స్వంత నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించింది. ఈ కమిటీలో అధ్యక్షుడిగా మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారిగా రామచంద్రమూర్తిని ఎన్నుకున్నారు. ఇతర పదవుల్లో ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను కూడా నియమించినట్లు తెలిపారు. అయితే, మరో రెండు వర్గాలు కూడా తమ తమ సమావేశాలు నిర్వహించి వేర్వేరు కమిటీలను ప్రకటించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రతి వర్గం తమదే అసలైన ప్రెస్ క్లబ్ కమిటీ అని పేర్కొంటూ సభ్యత్వాలు, కార్యాచరణపై వేర్వేరు ప్రకటనలు చేస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాప్రా ప్రాంత జర్నలిస్టుల్లో కొంత అయోమయం నెలకొంది. ఏ కమిటీ అధికారికమనే విషయంపై స్పష్టత అవసరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు. జర్నలిస్టుల ఐక్యతకు భంగం కలగకుండా పరస్పర చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, పలు రాజకీయ, సామాజిక నాయకులు నూతనంగా ఎన్నికైన కమిటీలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. మొత్తానికి, కాప్రా ప్రెస్ క్లబ్ మూడు భాగాలుగా విడిపోవడం స్థానిక జర్నలిస్టు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. త్వరలో పరస్పర చర్చలు జరిపి ఒకే వేదికపైకి వచ్చే అవకాశాలు ఉన్నాయని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులు

- విద్యారంగంపై మాటలే తప్ప చర్యలు శూన్యం - ఏ.ఐ.ఎస్.బి.విమర్శ
- ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌లు వెంటనే విడుదల చేయాలి
- ఏఐఎస్‌బీ రాష్ట్ర నాయకులు : అతికం రాజశేఖర్ గౌడ్



గంగాధర (ప్రశ్న న్యూస్)కరీంనగర్ జిల్లా, గంగాధర మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్‌బీ రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం మాటలకే పరిమితమైందని, ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్‌లు అందకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అలాగే కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును రక్షించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టే దిశగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎడపల్లి వంశీ కుమార్, తాళ్లపల్లి గణేష్ గౌడ్, ప్రశాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## పేదల కుటుంబాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- మహిళా సాధికారతే లక్ష్యం - రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ మండలంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వట్టెంల గ్రామంలో ఓపెన్ జిమ్, రూ.26 లక్షల సీసీ రోడ్లు, రూ.20 లక్షల గ్రామ పంచాయతీ భవనం, రూ.10 లక్షల మహిళా సమైక్య భవనం, నమిలిగుండుపల్లిలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్, రూ.12 లక్షల అంగన్వాడీ భవనానికి పునాది వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద కుటుంబాల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వట్టెంల గ్రామానికి ఇప్పటివరకు సుమారు రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వట్టెంల--చెక్కపల్లి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని, సైడ్ డ్రైనేజీలు నిర్మించాలని అధికారులకు ఆదేశించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మి ద్వారా ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల సాయం, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాల వడ్డీ మొత్తాన్ని మూడుసార్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు.

## శ్రీ భీమేశ్వరస్వామి సేవలో ప్రముఖ యాంకర్ సుమ కనకాల



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని బుధవారం ప్రముఖ యాంకర్ సుమ కనకాల దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకొని, వేములవాడ క్షేత్రానికి చేరుకొని స్వామివారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, స్వామివారి కృపా కటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి, స్వామివారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నునుగొండ రాజేందర్,జూనియర్ సహాయకులు నరాల రాజు,తదితర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థి ఉద్యమ నేతలకు బీవీఎస్ లో గుర్తింపు

- బహుజన విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీకి కొత్త నియామకాలు
- బీవీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ : జనగామ సంతోష్



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) బహుజన విద్యార్థి సంఘం (బీవీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌ను, రాష్ట్ర కార్యదర్శిగా కట్ట సతీష్‌ను నియమించినట్లు బీవీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జనగామ సంతోష్ వెల్లడించారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తూ సంఘం బలోపేతానికి కృషి చేసిన నేపథ్యంలోనే వీరికి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నియామకంపై స్పందించిన భాస్కర్, కట్ట సతీష్‌లు తమపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన బీవీఎస్ వ్యవస్థాపకులు జనగామ నర్సింగ్, సీనియర్ నాయకులు తాండ్ర భూమేశ్వర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ విద్యార్థి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

## కుమ్మెర ఘటనపై గళమెత్తిన బీసీ సాధికారత సంఘం




వేములవాడ (ప్రశ్న న్యూస్) నాగర్‌కర్నూల్ దాడిపై బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వేములవాడలో బీసీ సాధికారిత సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామ మల్లన్న జాతరలో రజకులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో రెండు నెలల పాప మృతి చెందడం పట్ల సంతాపం ప్రకటిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస్సాపూర్ శంకర్ మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేంత వరకు పరిషత్ ఎన్నికలు నిర్వహించవద్దన్నారు. ఉత్తర తెలంగాణ ఇంచార్జీ పొలాస నరేందర్ బడ్జెట్‌లో బీసీలకు తగిన నిధులు కేటాయించి, అంతరించిపోతున్న కుల చేతివృత్తులను రక్షించాలని కోరారు.

## ఓబులాపూర్‌లో హరిత వేద విద్యాలయానికి భూమి పూజ

- వేద జ్ఞానంతో యువతకు ఉపాధి మార్గం
- హరిత వేద విద్యాలయం నిర్వాహకులు
- గడ్డం శ్రీనివాస్ - తిరుమల



తంగళ్లపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్నా8ిస్8ిసిరిసిల్ల జిల్లా,తంగళ్లపల్లి మండలం, ఓబులాపూర్ గ్రామంలో బుధవారం హరిత వేద విద్యాలయ జ్యోతిష్య, పురోహిత శిక్షణ సంస్థకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, టీఎస్ఎస్ కళాకారుల బృందం, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, వేద విద్యాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గడ్డం శ్రీనివాస్, గడ్డం తిరుమల, గడ్డం కృష్ణ వంశీ, గడ్డం దిలీప్ కుమార్, గడ్డం పురుషోత్తం, పర్శ లచ్చయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అనుభవజ్ఞులైన వేద అధ్యాపకులు, జ్యోతిష్య గురువుల ద్వారా ఉచిత వేద విద్య శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. వేద మంత్రాలు, జ్యోతిష్యం, పూజా విధానాలు, హోమాలు తదితర అంశాల్లో ప్రాయోగిక శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. భక్తి, జ్ఞానం, ఉపాధి లక్ష్యాలతో సమాజంలో ఆధ్యాత్మిక అవగాహన పెంపొందించడమే తమ ఉద్దేశమని తెలిపారు.

## ఇంటర్ పరీక్షలను పరిశీలించిన కలెక్టర్



**సిద్ధిపేట** జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటర్మీడియట్ -2026 బోర్డు మార్గదర్శకాల ప్రకారం అత్యంత పారదర్శకంగా విద్యార్థులు ప్రశాంత వాతావరణం లో పరీక్ష రాసేలా విధులు నిర్వహించాలని చీఫ్ సూపరిండెంట్ ను ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా చూసుకోవాలి. పరీక్ష కేంద్రంలోకి ఫోన్ అనుమతి లేదని పూర్తి చెక్ చేశాకే లోపలికి అనుతించాలని, సెంటర్ చుట్టు 144 సెక్షన్ అమలుతో పాటు గట్టి బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

## మహిళల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

**కరీంనగర్** మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. లైంగిక వేధింపుల నిర్మూలన చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారిత కేంద్రం ద్వారా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిర్మూలన చట్టం 2013 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో లోకల్ కమిటీ మెంబర్ రాజా రెడ్డి ఈ చట్టంపై అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో మహిళల రక్షణ కోసం ఈ చట్టం ఎంత ముఖ్యమో వివరించారు. లైంగిక వేధింపుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఫిర్యాదులకు సంబంధించిన అంశంపై వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే హాజరై మాట్లాడారు. జిల్లాలో మండల స్థాయిలో ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా, మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని తెలిపారు. ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలు ఐసీసీ ఏర్పాటు చేసి, మహిళల ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు. నోడల్ అధికారులు చట్టం గురించి సందేహాలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రశాంతమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం అధికారులపై ఉందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి, మున్సిపల్ కమిషనర్లు, సిడిపిఓలు, ఎంపీడీవోలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి - ఇంటర్ పరీక్షా కేంద్రాలు తనిఖీ



**కరీంనగర్** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో పలు పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆర్ట్స్ డ కామర్స్, ముకరంపురాలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను, సీసీ కెమెరా వ్యవస్థను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, హాల్ టికెట్ల తనిఖీ, బందోబస్తు ఏర్పాట్లు తదితర విషయాలపై ఆరా తీశారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలని అన్నారు. మాల్ ప్రాక్టీస్ కి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జవాబు పత్రాల రవాణాకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని అన్నారు. ఒకేషనల్ కోర్సులు కలుపుకొని జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 15,389 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటిరోజు 400 మంది గైర్హాజరయ్యారు. 14,989 మంది పరీక్షలు రాశారు. మాల్ ప్రాక్టీస్ వంటి ఘటనలు ఏమీ చోటు చేసుకోలేదు.

## అంతర్జాతీయ వేదికపై మరో మారు అడుగుపెట్టనున్న: ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్ )భారతదేశం ,జర్మనీ దేశం పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్ సభ్యురాలిగా నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు.లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి నియమితులయ్యారు.దీంతో అంతర్జాతీయ వేదికపై ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మరో మారు అడుగుపెట్టనున్నారు.ఈ సందర్భంగా బుధవారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికపై దేశ సేవ చేసే ఈ గొప్ప అవకాశం నాకు రావడం చాలా ఆనందంగా, గర్వంగా ఉందని అన్నారు. భారతదేశం ,జర్మనీ దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో, రెండు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం సార్థకమైన పార్లమెంటరీ సహకారం అందించడంలో నేను పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఆమె చెప్పారు. భారతదేశం పక్షాన జర్మనీ దేశం టూర్ కు తనను ఎంపిక చేసిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, భారత పార్లమెంట్ లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా, ప్రోత్సహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నట్లు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఈ సందర్భంగా తెలిపారు.

## 20 వేలలోపు వేతనం పొందే కాంట్రాక్ట్ ఉద్యోగులందర్ని ప్రభుత్వ పథకాలకు వర్తింపు చేయండి



గత వైసిపి ప్రభుత్వం లో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని అన్యాయం చేసింది

కూటమి ప్రభుత్వం లో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసే అవకాశం ఏమైనా ఉందా.?


పుట్టపర్తి(ప్రశ్న న్యూస్)ప్రభుత్వం ద్వారా రూ.20వేలు లోపు వేతనం పొందుతున్న కాంట్రాక్టు , ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వ రాయితీ పథకాలు వర్తించేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో మంజూరు చేయాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడలోని అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ద్వారా ప్రభుత్వ రంగాల్లో నియామకం పొంది రూ.10 వేలు లోపు వేతనం తీసుకుంటున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వ రైతు పథకాలు ఏవి వర్తించడం లేదని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అలాకాకుండా 20వేల లోపు వేతనం తీసుకుంటున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలలో ప్రత్యేక రాయితీ పొందే వెసులుబాటు ప్రభుత్వం కల్పించాలని కోరారు. అదేవిధంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని హామీ ఇచ్చి 50,000 కాంట్రాక్ట్ ఉద్యోగులకు కాను కేవలం 3300 మందికి మాత్రమే కుదించిందన్నారు. చివరకు వారిని కూడా క్రమబద్ధీకరణ చేయకుండా వైసిపి ప్రభుత్వం వారికి తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో నైనా అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమపద్ధీకరణ చేసే అవకాశం ఏమైనా ఉందా అని ఎమ్మెల్యే పల్లె సింధూర ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ద్వారా ప్రవేట్ ఏజెన్సీలకు చెల్లిస్తున్న ప్రభుత్వ వేతనాలు కూడా ఈ ఉద్యోగులకు సక్రమంగా చెల్లించడం లేదని వీటిపై ప్రభుత్వం దృష్టి సాధించి వారికి న్యాయబద్ధమైన వేతనాలు సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను ప్రత్యేకంగా కోరారు.

## అంగన్వాడీలకు కనీస వేతనం 26000 డిమాండ్:సిఐటియు




ఎలమంచిలి (ప్రశ్న న్యూస్) అంగనవాడి టీచర్లకు,కనీస వేతనం 26000, ఆయాలకు, 20000 పెంచాలని, పెండింగ్ఉన్న 1810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్స్ చేసి మెయిన్ సెంటర్ గా మార్చాలని, చట్టబద్ధమైన గ్రాట్యూటీ అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు భర్తీ చేయాలని హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్( సిఐటియు) ఆధ్వర్యంలో యలమంచిలి అంగన్వాడి ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు రిలే దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి దేవుడి నాయుడు, అంగనవాడి ఎలమంచిలి ప్రాజెక్ట్ లీడర్ బి శశికళ, కే ఎం ఎస్ జయ మాట్లాడుతూ నేటి కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే అంగన్వాడీల సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు విస్మరించి అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోగా యాప్ల భారంతో పని ఒత్తిడిని పెంచుతున్నాయని 24 గంటలు యాప్స్ తోనే సరిపోతుంటే ఎప్పుడు పిల్లలకి చదువు చెప్పాలని ప్రశ్నించారు ధరల విపరీతంగా పెరుగుతున్నప్పటికీ అంగన్వాడీల జీతాలు మాత్రం పెంచడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు అచ్చుతాపురం రాంబల్లి మండల కన్వీనర్లు కె సోము నాయుడు సిహెచ్ రామకృష్ణ పి అంజలి ఏ అన్నపూర్ణ బి సంతోష్ వై యమునా కే విజయలక్ష్మి కె కుసుమకుమార్ ఆర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## ఇసుక కావలసినవారు వేలంలో పాల్గొన వచ్చు




ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో గల ఎమ్మార్వో కార్యాలయం లొ ఇరవై ఏడవ తారీఖున ఉదయం పదకొండు గంటలకు అక్రమంగా పట్టుకున్న ఇసుక వేలానికి వస్తుందని ధర్పల్లి ఎమ్మార్వో శాంత తెలిపారు. కొటాల్పల్లి శివారులో నూటాయబై ట్రాక్టర్ల ఇసుక గ్రామ పాలన అధికారి, హొన్నాజీపేట్ శివారులో యాబై ట్రాక్టర్ ల ఇసుక ను గ్రామ పాలనాధికారు ల సమక్షంలో ధర్పల్లి మండల గిర్ధవర్ ఇసుకను సీజ్ చేయడం జరిగింది. ఈ వేలం సజావుగా సాగాలని పోలీసులకు, విలేకరులకు ఆయా గ్రామాల గ్రామ పాలన అధికారులకు తెలియజేయడం జరిగింది.

# విస్తృత స్థాయిలో కిడ్నీ రోగులకు ఉచిత డయాలసిస్ సేవలు

**గడిచిన 20 నెలల్లో 14 కేంద్రాల ప్రారంభం**

**త్వరలో వినియోగంలోనికి రానున్న మరో 11 నూతన కేంద్రాలు**

**శాసన మండలిలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**



అమరావతి (ప్రశ్న న్యూస్) పేద కిడ్నీ రోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ఉచిత డయాలసిస్ సేవలను విస్తృతం చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. శాసనమండలిలో బుధవారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సత్యకుమార్ సమాధానమిస్తూ 76 ప్రభుత్వాసుపత్రులు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలోని 176 అనుబంధ ఆసుపత్రుల్లో కలిపి 2,721 యంత్రాల ద్వారా 21,504 మంది రోగులు ఉచితంగా డయాలసిస్ సేవలు పొందుతున్నారని తెలిపారు. గడిచిన 20 నెలల్లో సెకండరీ ఆసుపత్రుల్లో కొత్తగా 14 డయాలసిస్ కేంద్రాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని పేర్కొన్నారు. అంతేకాకుండా కిడ్నీ రోగులకు మరింత సౌకర్యంగా ఉండేందుకు సెకండరీ ఆసుపత్రుల్లోనే కొత్తగా మరో 11 ఉచిత డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోనికి తీసుకురాబోతున్నామని వెల్లడించారు.

### పెరిగిన సేవలు

గత ప్రభుత్వ హయాంలో 47 సెకండరీ ఆసుపత్రుల్లో 555 యంత్రాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం రోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వీటి సంఖ్యను అదనంగా 161కు పెంచిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటోన్న చర్యలవల్ల సెకండరీ ఆసుపత్రుల్లో డయాలసిస్ పొందే వారి సంఖ్య 75% వరకు పెరిగిందని వెల్లడించారు గతంలో నెలకు 40వేల సెషన్ల ద్వారా మాత్రమే రోగులకు సేవలు అందేవని తెలిపారు. కూటమి ప్రభుత్వ చర్యలతో ప్రస్తుతం సగటున నెలకు 66వేల సెషన్ల ద్వారా రోగులకు ఉచితంగా సేవలు అందుతున్నాయని చెప్పారు. ఒక్కొక్క రోగికి ఉచితంగా అందించే డయాలసిస్ సేవల కోసం ఏడాదికి సగటున రూ. 86వేల చొప్పున ప్రభుత్వం ఖర్చు పెడుతోందని తెలిపారు. గడిచిన 20 నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.224 కోట్ల వరకు ఖర్చుపెట్టిందని వెల్లడించారు. కిడ్నీ రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. రోగుల ఆరోగ్య స్థితికి అనుగుణంగా ప్రభుత్వంగా పెన్షన్ కూడా ఇస్తోందని ఈ సందర్భంగా తెలిపారు.

## సోలార్ ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



నంద్యాల(ప్రశ్న న్యూస్) నంద్యాల జిల్లాలో అమలులో ఉన్న సోలార్ విద్యుత్ పథకాల పురోగతిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ సుధాకర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు, సోలార్ వెండర్లతో కలిసి వివిధ పథకాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ పీఎం-కుసుమ్-సి పథకం కింద జిల్లాలో చేపట్టిన 9 పనులలో 4 పనులకు ఇప్పటికే స్థలాలు ఖరారు చేసామని మిగిలిన పనులకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖరారైన 4 పనులకు తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా రైతులకు పగటి పూట నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 117 ఎకరాల విస్తీర్ణంలో 29 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి 'వృద్ధి ఇన్ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్'కు లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్ వో ఏ) జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 13,595 వ్యవసాయ పంప్సెట్లకు నిరంతర సౌర విద్యుత్ సరఫరా కల్పించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

## పలాసలో ఎయిర్ పోర్టు షురూ

**ఏపీ ఎయిర్పోర్టు ఎండితో ఎమ్మెల్యే గౌతు శిరీష భేటీ**



పలాస (ప్రశ్న న్యూస్) శ్రీకాకుళం జిల్లా, పలాస నియోజకవర్గంలో ఎయిర్ పోర్టు నిర్మించేందుకు ప్రక్రియ వేగవంతమైనట్టు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చెప్పారు. ఈ మేరకు మంగళగిరిలోని ఏపీ ఎయిర్ పోర్టు డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎం.డి ప్రవీణ్ ఆదిత్య తో బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ పలాసలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మిస్తున్నారనే అపోహలు వ్యాప్తి చెందాయన్నారు. కానీ పలాసలో నిర్మించేది పౌరులు ప్రయాణించేందుకు వీలున్న ఎయిర్ పోర్టు అని, పౌర విమానయనానికే అని స్పష్టం చేసారు. దేశంలోని రైలు ప్రయాణ రద్దీని తగ్గిస్తూ అదే సమయంలో సామాన్యులకు అందుబాటులో ప్రయాణ సదుపాయాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఉడాన్ పథకంలో భాగంగా వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వి. జి. ఎఫ్) విధానంలో రెండేళ్లపాటు నేరుగా కేంద్ర ప్రభుత్వమే నిర్వహణ బాధ్యతలు చేపడుతుందన్నారు. పలాస ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే సెకండ్ ఏసీ రైలు ప్రయాణికుల వివరాలను సేకరించినట్టు చెప్పారు. అయితే ఈ ఎయిర్ పోర్టు అందుబాటులోకి వస్తే దేశంలోని ప్రముఖ నగరాలైన చెన్నై, బెంగుళూరు, ముంబై, హైదరాబాద్, ఢిల్లీ వంటి నగరాలకు విమానాలు నడిపే అవకాశం ఉందన్నారు. అయితే ఈ ఎయిర్ పోర్టు నిర్మాణంలో నిర్వాసితులకు కూడా ప్రభుత్వం పరిహారం అందిస్తుందని వెల్లడించారు.

## అసెంబ్లీలో మంచినీళ్ళపేట మత్స్యకారుల గళం

**మినీ జెట్టి కోసం మంత్రికి నేరుగా వినతి**

**ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో గ్రామ పెద్దలు, మత్స్యకారులతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడుకు లేఖ సమర్పణ**

**- త్వరిత పరిష్కారానికి హామీ**



శ్రీకాకుళం(ప్రశ్న న్యూస్) శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం, మంచినీళ్ళపేట గ్రామ మత్స్యకారుల "మినీ జెట్టి" డిమాండ్ శాసనసభ వేదికగా బలంగా వినిపించింది. పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష,మంచినీళ్ళపేట గ్రామ ప్రజలు మత్స్యకారులతో కలిసి రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ని అసెంబ్లీలో కలిసి, గ్రామస్థులు అందించిన వినతిపత్రాన్ని నేరుగా సమర్పించారు.సుమారు 5 వేల జనాభా గల మంచినీళ్ళపేటలో 100 ఇంజిన్ బోట్లు, 100 కట్ల తెప్పలతో మత్స్యకారులు జీవనం సాగిస్తున్నప్పటికీ, ఫిషింగ్ జెట్టి లేకపోవడం వల్ల ప్రతి ఏటా కెరటాలు తుఫాన్ల సమయంలో ప్రాణనష్టం, ఆస్తినష్టం జరుగుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. జెట్టి లేకపోవడంతో వలలు, ఇంజిన్లు, బోట్లు ధ్వంసమై లక్షలాది నష్టం వస్తోందని, పని లేక ఏటా సుమారు 500 మంది గుజరాత్, గోవా, బొంబాయి, కర్ణాటక, మంగుళూరు వంటి ప్రాంతాలకు వలస వెళ్లి అక్కడ కూడా ప్రమాదాల బారిన పడుతున్నారని మంత్రికి వినతిపత్రంలో పేర్కొన్నారు.

## మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ కళకళ బహిరంగ సభా వేదికలో: సీఎం చంద్రబాబు నాయుడు.

**రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు బ్లూప్రింట్**

**ఈ ఏడాది జూలైకి వెలిగొండ తొలిదశ పూర్తి చేసి నీళ్లు**



మార్కాపురం(ప్రశ్న న్యూస్) ఈ ఏడాది జూలై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తిచేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్లు చేసి దొంగ నాటకాలు ఆడటం తమకు చేతకాదని సీఎం వ్యాఖ్యానించారు. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని సీఎం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. దీనికోసం విశ్రాంత ఇంజనీర్లతో ఓ బృందాన్ని వేసి అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు ఇచ్చే అంశంపై బ్లూ ప్రింట్ తయారు చేస్తామని అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లెలో రూ.456 కోట్లతో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రైతులతో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం మార్కాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేటు ఇచ్చారు. అరకు మొదలుకొని ప్రకాశం వరకూ మంచి విజయం అందించారు.



## అందగత్తెను పట్టించుకోని
# అదృష్టం!

ఎవరు ఏ రంగాన్ని ఎంచుకున్నప్పటికీ, అందులో రాణించాలంటే ప్రతిభ ఉండాలి. టాలెంట్ ఒక్కటి ఉంటే సరిపోతుందా అంటే, కొంచెం అదృష్టం కూడా ఉండాలనుకోండి అనే సమాధానం వస్తుంది. అదృష్టం అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వాళ్లకి ఉంటాయి. కాకపోతే అదృష్టం అనే దాని గురించి అప్పుడప్పుడు నమ్మవలసి వస్తుంటుంది. అందుకు కారణాలు .. కళ్లముందు కనిపించేవే అని చెప్పాల్సి ఉంటుంది. ఆశించినస్థాయిలో గుర్తింపు రానప్పుడు .. విజయాలు అందనప్పుడు .. అదృష్టం లేదని చెప్పుకుంటూ ఉంటారు. అలాంటి అదృష్టాన్ని వెతికి పట్టుకునే పనిలో ఉంటారు. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే అదే పనిలో ఉందని అంటున్నారు. ఇప్పుడున్న కథానాయికలలో గ్లామరస్ బ్యూటీ ఎవరంటే కుర్రకారు ఠకీమని చెప్పే మాట భాగ్యశ్రీ బోర్సే. తుమ్మెదల్లాంటి కళ్లతో మనసులు దోచే ఈ సుందరికి ఇంతవరకూ హిట్టు పడలేదు. ఆమె అభిమానులు బెంగపెట్టుకోవడంలోని అసలు కారణం ఇదే. ఈ నేపథ్యంలో ఆమె అఖిల్ సరసన నాయికగా 'లెనిన్' సినిమా చేస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను, అన్నపూర్ణ - సితార సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'మే'లో ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో ఉన్నారు. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. భాగ్యశ్రీ గ్లామర్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సినిమాతోనైనా ఆమెకి అదృష్టం కలిసొస్తుందేమో చూడాలి మరి.

# పక్కా తెలంగాణ ప్రేమకథ



'ఈ కథలోని సంఘర్షణ కొత్తగా ఉంటుంది.క్లైమాక్స్ ఘట్టాలు హృదయానికి హత్తుకుంటాయి. దర్శకుడు సతీష్ కథ చెప్పినప్పుడు తప్పకుండా గొప్ప చిత్రంగా మిగిలిపోతుందనే నమ్మకం కలిగింది' అన్నారు కోన వెంకట్. ఆయన నిర్మాణంలో రూపొందించిన చిత్రం 'బ్యాండ్ మేళం'. 'కోర్ట్' ఫేమ్ హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. సతీష్ జవ్వాజీ దర్శకుడు. మార్చి 13న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి తమన్, శివాజీ అతిథులుగా హాజరయ్యారు. ఇది పక్కా తెలంగాణ బ్యాక్‌డ్రాప్ విలేజ్ స్టోరీ అని, ప్రతీ ఎమోషన్ పీక్‌లో ఉంటుందని, యువతతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కనెక్ట్ అవుతుందని హీరో హర్ష్ రోషన్ తెలిపారు. మనసుని కదిలించే ప్రేమకథ ఇదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, నిర్మాణ సంస్థ: కోన ఫిల్మ్ కార్పొరేషన్, సమర్పణ: మ్యాగో మాస్ మీడియా, రచన-దర్శకత్వం: సతీష్ జవ్వాజి.

# 10 ఏండ్ల నా కష్టానికి
## దక్కిన ప్రతిఫలం 'డంకీ' : తాప్సీ



బాలీవుడ్ స్టార్ నటి తాప్సీ పన్నూ తన సినీ ప్రయాణంతో పాటు రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వంలో వచ్చిన 'డంకీ' సినిమా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం 'అస్సీ' ఈదచిత్రం ప్రేక్షకుల ముందుకు రాగా.. సినిమా ప్రమోషన్స్‌లో పాల్గోన్న తాప్సీ మాట్లాడుతూ.. తన 10 ఏండ్ల కష్టానికి దక్కిన అరుదైన బహుమతిగా 'డంకీ' చిత్రాన్ని అభివర్ణించింది. పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ, మెయిన్ స్ట్రీమ్ కమర్షియల్ హీరోయిన్‌గా తనను అంగీకరించడానికి మేకర్స్ ఇంకా కొంత సమయం తీసుకుంటున్నారని ఆమె అభిప్రాయపడింది. 'అస్సీ', తప్పడ్ వంటి వైవిధ్యమైన, కంటెంట్ ఉన్న సినిమాలు చేయడం వల్లే తనకు 'డంకీ'లో అవకాశం వచ్చిందని, ఆ చిత్రాలలో తన నటనను చూసి దర్శకుడు హిరానీ గారు తనను ఎంచుకున్నారని తాప్సీ తెలిపింది.నిజానికి తన కెరీర్ దక్షిణాదిలో పూర్తి మాస్ సినిమాలతోనే మొదలైందని, హిందీలో కూడా డేవిడ్ ధావన్ వంటి కమర్షియల్ దర్శకుడి చిత్రంతోనే ఎంట్రీ ఇచ్చానని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకుంది. అయినప్పటికీ, తనను కేవలం గ్లామరస్ పాత్రలకు పరిమితం చేయకుండా పరిశ్రమ కొత్త కోణంలో చూడటానికి కొంత సమయం పట్టిందని తెలిపింది. షారుఖ్ ఖాన్ మరియు రాజ్‌కుమార్ హిరానీ కాంబినేషన్‌లో వచ్చిన 'డంకీ' బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడమే కాకుండా, తాప్సీ నటనకు విమర్శకుల నుండి ప్రశంసలు కూడా అందాయి.



## తమిళంలో హీరోయిన్‌గా
# టాలీవుడ్ 'బేబి' వైష్ణవి చైతన్య..!

తెలుగులో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన బేబి సినిమాతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది వైష్ణవి చైతన్య ఈ భామ ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో మరో సినిమా చేస్తూ బిజీగా ఉంది. కాగా ఈ బ్యూటీ ఇక తమిళంలో కూడా తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయిందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. వైష్ణవి చైతన్య, పాపులర్ కోలీవుడ్ కంపోజర్ కమ్ యాక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా తెరకెక్కబోతున్న సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని తాజా కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ భామ ఇప్పటికే తమిళంలో అజిత్ కుమార్ నటించిన వలిమైలో కామియో రోల్‌లో మెరిసింది. ఇదే నిజమైతే వైష్ణవి చైతన్యకు తమిళంలో హీరోయిన్‌గా తొలి సినిమా ఇదే కానుంది. మొత్తానికి వైష్ణవి చైతన్య బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో సౌతిండియన్ ఫిలిం ఇండస్ట్రీలో తనకంటూ స్పెషల్ ఐడెంటిటీ తెచ్చుకోవాలనే ప్రయత్నంలో బిజీగా ఉన్నట్టు తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. మరి నుంచి రానున్న రోజుల్లో వైష్ణవి చైతన్య నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.

# శెన్బా కలల ప్రయాణం



తమిళనాడులోని ఓ టౌన్‌కి చెందిన శెన్బాకి దక్షిణకొరియా వెళ్లడం ఓ కల. ఆ కలను శెన్బా ఎలా నిజం చేసుకున్నది? అనే ప్రశ్నకు సమాధానమే 'మేడ్ ఇన్ కొరియా'. ప్రియాంక మోహన్, దక్షిణ కొరియా నటుడు పార్క్ హై-జిన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ విభిన్న కథా చిత్రానికి రా.కార్తిక్ దర్శకుడు. రైజ్ ఈస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణంలో రూపొందిన ఈ చిత్రం మార్చి 12న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. కొరియన్, తమిళ సంస్కృతుల మధ్య ఉన్న చారిత్రాత్మక అనుబంధాలను ఆవిష్కరించే సినిమా ఇదని దర్శకుడు రా.కార్తిక్ చెప్పారు. శెన్బా అనే అమ్మాయి భావోద్వేగ ప్రయాణమే ఈ సినిమా అని నటి ప్రియాక మోహన్ పేర్కొన్నారు. ఇంకా నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధి మోనికా షెర్గిల్ కూడా మాట్లాడారు.

# అదే నా డ్రీమ్ ప్రాజెక్ట్!



లాయర్ కావాలనుకొని నటిగా మారానని, తెలుగు సినిమాలకే తన తొలి ప్రాధాన్యం అని చెప్పింది కథానాయిక నయన్ సారిక. గం గం గణేశా, ఆయ్, క వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైందీ మరాఠీ భామ. ఆమె శ్రీవిష్ణు సరసన నటించిన తాజా చిత్రం 'విష్ణు విన్యాసం'. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ సినిమా.. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం నయన్ సారిక విలేకరులతో సినిమా విశేషాల్ని పంచుకుంది. ఈ సినిమాలో తన పాత్రపేరు మనీషా అని, కాలేజీ లెక్చరర్‌గా కనిపిస్తానని చెప్పింది. ఇద్దరు లెక్చరర్స్ నడుమ ప్రేమకథగా, వినోదంతో పాటు భావోద్వేగాలతో ఆకట్టుకునే కథాంశమిదని ఆమె తెలిపింది. 'మనీషా పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. ఓరకంగా హీరోపై డామినేటింగ్‌గా అనిపిస్తుంది. ఫస్టాఫ్‌లో నా క్యారెక్టర్ అబ్బాయిలకు కాస్త చిరాకుగా అనిపిస్తుంది. అందుక్కారణం ఏమిటో ద్వితీయార్ధంలో తెలుస్తుంది. అప్పటి నుంచి మనీషాను అందరూ ఇష్టపడతారు' అని నయన్ సారిక చెప్పింది. ప్రేక్షకుల్ని నవ్వించడం చాలా కష్టమని, ఈ విషయంలో శ్రీవిష్ణు చాలా టాలెంటెడ్ అని, ఆయన కామెడీ టైమింగ్ నేచురల్‌గా ఉంటుందని ప్రశంసించింది. ఇటీవల ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకోవడంతో తన కల నెరవేరిన అనుభూతి కలిగిందని, రాజమౌళి దర్శకత్వంలో పని చేయాలన్నది తన డ్రీం అని నయన్ సారిక తెలిపింది.

# ఏడుస్తూనే నిద్రపోయేదాన్ని!



'బాడీ షేమింగ్‌కు గురై తీవ్రమైన మానసిక వ్యధకు లోనైన సందర్భాలు నా జీవితంలో కోకొల్లలు' అని బాలీవుడ్ భామ మృణాళ్‌ఠాకూర్ అన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె తన శరీర బరువుపై ఎదుర్కొన్న ట్రోలింగ్ గురించి మాట్లాడారు. 'ఆ రోజులింకా నా కళ్లలో కదులుతూనే ఉన్నాయి. ఏడ్చీ ఏడ్చీ అలసిపోయి నిద్రపోయేదాన్ని. పొద్దున్నే లేచేసరికి కళ్లు ఉబ్బిపోయి ఉండేవి. నేను అప్పట్లో కాస్త బొద్దుగా ఉండేదాన్ని. దాంతో నా చుట్టూ ఉండేవారే నన్ను ట్రోల్ చేసేవారు. ఆ ట్రోలింగ్ ప్రభావంతో ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయేదాన్ని. అలాంటి సమయంలో అక్షయ్‌కుమార్ మాటలు నాలో మార్పుని తెచ్చాయి. 'ట్రోలింగ్ వినకుండా ముందుకు సాగాలి. పాత్ర కోసం సన్నగా మారాల్సివస్తే కచ్చితంగా మారాలి' అని ఆయన చెప్పిన ఆ మాటలు నాపై బలంగా పనిచేశాయి. అప్పట్నుంచీ నా శరీరాకృతి గురించి ఆందోళన చెందడం మానేశాను. ఓ రోజు జిమ్‌కు వెళ్లినప్పుడు అక్కడ సన్నగా నాజూగ్గా ఉండే అమ్మాయిలు నా దగ్గరకొచ్చి 'మీలా మేమూ మారాలంటే ఏం చేయాలి?' అని అడిగారు. మనం ఎలా ఉన్నా నచ్చేవాళ్లకు నచ్చుతామని అప్పుడర్థమైంది. ముందు మనల్ని మనం గౌరవించుకుంటే. ఆటోమేటిగ్గా ఎదుటివారు మనల్ని గౌరవిస్తారు' అంటూ చెప్పుకొచ్చింది మృణాళ్‌ఠాకూర్.

# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



మంథని ( ప్రశ్న న్యూస్) ఇంటర్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు తెలుగు, హిందీ..సంస్కృతం,.. ఉర్దూ..పరీక్షలు జరిగాయి. మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాలికల కళాశాలలో మొత్తం 208 మంది విద్యార్థులకు గాను 202 మంది హాజరయ్యారు. బాలుర కళాశాలలో 158 మందికి గాను 154 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రేపటి నుంచి ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లను నియమించలేదు.



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లను నియమించలేదని లబ్ధిదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు అసత్య ఆరోపణలు చేస్తున్న కౌన్సిలర్ పోతరబోయిన శ్రీలత క్రాంతి మతి భ్రమించి మాట్లాడుతున్నారు వారు చేస్తున్న ఆరోపణలో ఎలాంటి నిజం లేదని ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు గుండ రాజు, తీగల సమ్మయ్య, పోలు శివ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం మంథని పట్టణంలోని ఆరో వార్డు ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. మంథని మున్సిపాలిటీ పరిధిలో 13 వార్డులలో ఏ వార్డులో లేనివిధంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల వినతి మేరకు 54 ఇండ్లను మంత్రి శ్రీధర్ బాబు మంజూరు చేయించాడని వారు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకోవాలని పూర్తి సహకారం అందిస్తామని, ఎవరైనా లబ్ధిదారులను బెదిరింపులు గురిచేస్తే తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. కొందరు తమ రాజకీయ లబ్ధి కోసమే అధికార కాంగ్రెస్ పార్టీని పార్టీ కార్యకర్తలను బదునామ్ చేస్తున్నారని పోతారవేణి రాజయ్య, అట్టెం వినయ్, కొంతం శ్రీను, మోహన్, నాయని సంతు ఆరోపించారు.

# ప్రజల నమ్మకానికి నిలబెట్టుకోవాలి

**- ఎమ్మెల్సీ మల్క కొమురయ్య**

**బిజెపి కార్పొరేటర్, కౌన్సిలర్ లకు అభినందన సభ**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కలిసి హాజరు**



హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ ) హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన భారతీయ జనతా పార్టీ మేయర్, డిప్యూటీ మేయర్లు, చైర్మన్, డిప్యూటీ చైర్మన్ లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ తో కలిసి టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, పార్టీ ఇతర పెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్, ఇతర కార్పొరేటర్లను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య వారికి అభినందనలు తెలియజేశారు. మీరంతా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# అక్రమ నిర్మాణంపై నుండి పడి వ్యక్తి మృతి

**కేసు నమోదు చేసిన వారసిగూడ పోలీసులు**



సీతాఫలామండి (ప్రశ్న న్యూస్) అక్రమ నిర్మాణం పై నుండి జారిపడి ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం నాలుగవ అంతస్తులో గోవా కట్టెలు తొలగిస్తుండగా బశెట్టి రాజు (41) కాలుజారి కింద పడ్డట్టు తెలిపారు. అయితే కార్మికునికి రక్షణ కిట్ ఇవ్వలేదా.? సేఫ్టీ చర్యలు తీసుకోకుండా ఎలా నిర్మాణ పనులు చేపిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థానానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు ఎస్సై రామచంద్ర రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజేందర్ గౌడ్ తెలిపారు.

# చదువును మించిన డబ్బు లేదు: పెద్దిటి బుచ్చిరెడ్డి

**నేటి బాలలు రేపటి తరానికి మార్గదర్శకం కావాలి**




సాయి రామ్ కాన్వెంట్ హై స్కూల్లో కార్గిల్, సింధూరు ఆటపాటలతో ఆకట్టుకున్న విద్యార్థులు

ఉప్పల్ (ప్రశ్న న్యూస్) చదువుతో ఏదైనా సాధ్యమని, చదువును మించి డబ్బు లేదని పెద్దిటి బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారం సాయి రామ్ కాన్వెంట్ హై స్కూల్లో చిన్నారుల వార్షికోత్సవ వేడుకలు సందడితో ఘనంగా నిర్వహించారు. చిన్న పిల్లలు రంగురంగుల వేషధారణలతో వేదికపైకి వచ్చి నృత్యాలు, పాటలు, నాటికలతో ప్రేక్షకులను, తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నారు.అమాయక నటన, ఉత్సాహభరిత ప్రదర్శనలు తల్లిదండ్రులను ఆనందపరిచాయి.ప్రత్యేకంగా కార్గిల్ యుద్ధం, ఆపరేషన్ సింధూరు అంశాలపై ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. కార్గిల్ యుద్ధంలో సైనికుల త్యాగాలు, దేశసేవ భావనలను చిన్నారులు హృద్యంగా ఆవిష్కరించగా, సింధూరు ప్రాధాన్యతను ప్రతిబింబించే ప్రదర్శన ఆకట్టుకుంది.ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ పెద్దిటి బుచ్చి రెడ్డి హాజరై చిన్నారులను అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి బాలల రేపటి భావితరానికి మార్గదర్శకులు కావాలని,ఇంత డబ్బు నా ఆస్తిపాస్తులు ఎంతున్న చదువు ఉంటే అన్నీ ఉన్నట్టేనని, చదువును మించిన బలం లేదని, చదువుతోపాటు పిల్లలకు ఆటపాటలపై, క్రీడల పైన శ్రద్ధ చూపాలని ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లలను ఉత్తేజ పరిచిన వాళ్ళమవుతామని, కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ టీచర్లకు ఈ సందర్భంగా అభినందించారు. తెలిపారు. సందర్భంగా ప్రిన్సిపాల్ మనసా రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు దేశభక్తి, సాంస్కృతి సాంప్రదాయాలను విలువల పెంపకానికి పాఠశాల కట్టుబడి ఉందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా కొనసాగించారు.

# తౌటి నాగయ్య మృతి పార్టీకి తీరని లోటు

# - ఆయన సేవలు మరువలేం

**- సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు : కడారి రాములు**



సిరిసిల్ల /వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్లో సిపిఐ పార్టీ సీనియర్ కార్యకర్త, తౌటి నాగయ్య బుధవారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు ఆధ్వర్యంలో అజ్జ వేణు, వడ్డెపల్లి లక్ష్మన్, కొంక విజయ్, మచ్చ అనసూయ తదితరులు సిపిఐ పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ తొలితరం కమ్యూనిస్ట్ నాయకులతో కలిసి బివైనగర్ ఉద్యమంలో, బీడీ పోరాటంలో, పవర్ లూం పోరాటాల్లో ,చెన్నమనేని రాజేశ్వర్ రావు, సామల. మల్లేశం లతో కలిసి పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పనిచేసి, చివరి శ్వాస వరకు కమ్యూనిస్టుగా బతికారని, బూర్జువా రాజకీయాలు ఎన్ని వున్నా తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుదకంటూ కమ్యూనిస్టుగా ఉండి, తుదిశ్వాస విడవడం పట్ల పార్టీ గొప్ప కార్యకర్తను కోల్పోయిందని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు.

# న్నారుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు

**- అంగన్వాడీ నూతన భవనంతో సేవలు మరింత మెరుగుపడుతాయి**

**- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**



వేములవాడ.(ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలంలోని కొత్తపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నూతన అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ నియోజకవర్గ శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల పోషణ, ప్రీ-స్కూల్ విద్య, గర్భిణీ స్త్రీలు,బాలింతలకు అందించే సేవలు మరింత మెరుగుపడేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.అంగన్వాడీ కేంద్రాలు గ్రామ అభివృద్ధికి పునాది వంటివని, కొత్త భవనంతో పిల్లలకు సురక్షితమైన, శుభ్రమైన వాతావరణంలో సేవలు అందుతాయని తెలిపారు.ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, పోషణ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి గ్రామంలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. చిన్నారుల భవిష్యత్తు బలపడితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీరామోజు శ్రీనివాస్,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ నేతలు

**- సంపత్ కుటుంబంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా వివాహ వేడుకలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు చెంచు సంపత్ సోదరుని వివాహ వేడుక కొత్తపేటలోని ఫంక్షన్ హాల్లో బుధవారం ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి పార్టీ శ్రేణులు, గ్రామస్థులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్ రావు,జిల్లా నాయకులు,నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, “వివాహం అనేది ఇద్దరి వ్యక్తుల మధ్య బంధం మాత్రమే కాదు, రెండు కుటుంబాల కలయిక. పరస్పర గౌరవం, అవగాహన, సహనం దాంపత్య జీవితానికి పునాది కావాలి. నూతన దంపతులు ఆనందంగా, ఆదర్శంగా జీవించి సమాజానికి మార్గదర్శకులవ్వాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆంధ్రా యూనివర్సిటీ ప్రతిష్టను దెబ్బతీస్తున్న కూటమి ప్రభుత్వం

**వైఎస్ఆర్సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం**

**వర్కింగ్ ప్రెసిడెంట్ ద్రోణంరాజు శ్రీవత్సవ**



విశాఖ(ప్రశ్న న్యూస్) వైఎస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ఆర్సీపీ విద్యార్థి విభాగం మరియు యువజన విభాగం ఆధ్వర్యంలో పత్రిక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ద్రోణంరాజు శ్రీవత్సవ , యువజన విభాగం ప్రెసిడెంట్ ఉరుకుటి చందు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి ఆంధ్ర యూనివర్సిటీలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి, విద్యార్థుల సమస్యల తరఫున ఆందోళనలు దిగినంతవరకు యూనివర్సిటీ యాజమాన్యం, వైస్ ఛాన్సలర్ నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని దానికి పరాకాష్టగా మొన్న ఏబీవీపీ ఎస్ఎఫ్ఐ యూనియన్స్ మధ్య గొడవని వీళ్ళు సమయానికి పరిష్కరించలేకపోవడం వల్ల చిలికి చిలికి గాలి వానగా మారి ఆఖరికి పోలీసులు సెక్షన్ 30 అమలుచేసి ప్రత్యక్షంగా పోలీసు కమిషనర్ తాత్కాలికంగా సమస్యని అదుపుచేయల్సొచింది యూనివర్సిటీల్లో విద్యార్థుల మధ్య ఘర్షణలు సహజమని వాటిని నాలుగు గోడల మధ్యలో యాజమాన్యం అదుపు చేయాల్సిందిపోయి గొడవలని పెద్దవి అయ్యేవరకు వదిలేస్తున్నారంటే యూనివర్సిటీ ప్రతిష్ఠను నీరుగార్చే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తుందనే సందేహం కలిగేలాఉందని,ఈ ప్రభుత్వానికి ప్రైవేట్ సంస్థల పైన ఉండే మమకారం ప్రజలు గ్రహిస్తున్నారని ఆంధ్ర యూనివర్సిటీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని శతాబ్ది సంబరాలు జరుపుకోవాల్సిన సమయంలో ఇలా ఆంధ్రా యూనివర్సిటీ ప్రతిష్ఠను పాడుజేస్తూ గీతం యూనివర్సిటీ లాంటి ప్రైవేట్ సంస్థలకు సహక రించడం సరికాదని తెలియజేశారు. అలాగే రాబోయే రోజుల్లోనైనా ప్రభుత్వం కళ్ళుతెరిచి ఇలాంటి విశ్వ విద్యాలయాల గౌరవాలని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం ఉత్తరాంధ్ర జోనల్ ప్రెసిడెంట్ అంబటి శైలేష్ , జిల్లా విద్యార్థి విభాగం ప్రెసిడెంట్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మంచినీరు కలుషితం కాకుండా ఉండేలా గట్టి చర్యలు

**-ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ**

**-గత ప్రభుత్వ హయాంలో నిర్వహణ అస్తవ్యస్తం**

**-రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్**



అమరావతి (ప్రశ్న న్యూస్ )మంచినీరు కలుషితం కాకుండా, డయేరియా కేసులు రాకుండా చూసేందుకు సదరు ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్ర శాసనమండలిలో బుధవారం సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సత్యకుమార్ సమాదానమిస్తూ గత ప్రభుత్వం హయాంలో సంవత్సరాల తరబడి మంచినీటిలో అవసరాలకు తగ్గట్లు కోరినేషన్ జరగలేదన్నారు. జగ్గయ్యపేటలో ఓ చోట వాటర్ ఫిల్టర్ నాలుగేళ్ల నుంచి మార్చకపోవడాన్ని తాను స్వయంగా గమనించానన్నారు క్లోరినేషన్ గురించి గత ప్రభుత్వం అసలు పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన అనంతరం మంచినీరు కలుషితం కాకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు విజయవాడ వంటి పట్టణాల్లో పలుచోట్ల డయేరియా ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు గుంటూరు శివారులోని తురకపాలెంలో మెలియోడియోసిస్ కేసులు వచ్చాయన్నారు.

## ఇంటింటా సర్వే

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన అనంతరం మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు నీరు కలుషితం కాకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపబడుతున్నాయన్నారు ప్రతి మంగళవారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిర్దేశిత ప్రాంతాల్లో పైపు ద్వారా సరఫరా జరిగే నీటి నమూనాలు సేకరించి పరీక్షిస్తున్నారన్నారు నీరు కలుషితమైనట్లు గుర్తిస్తే వెంటనే సదరు శాఖలను అప్రమత్తంచేసి, అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓవర్హెడ్ ట్యాంకుల శు భ్రంచేసే చర్యలు జరుగుతున్నాయన్నారు. క్లోరినేషన్ అవసరాలకు తగ్గట్లు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందన్నారు. సర్వైలెన్స్ పెంచామని, సందర్భాలకు తగ్గట్లు ఇంటింటా సర్వేలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ జలజీవన్ మిషన్ ద్వారా సురక్షిత నీరు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సత్యకుమార్ వివరించారు.

# అమీర్‌పేట సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల పరంపర

**- అనుమతులు రెసిడెన్షియల్... వినియోగం కమర్షియల్ - అధికారుల మౌనం వెనుక లంచాల వర్షమా?**









హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ నగర అభివృద్ధికి కేంద్రమైన అమీర్‌పేట సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్ కార్యకలాపాలు నిర్వహించడం, అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులు, సెల్లార్లు నిర్మించడం జోరుగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు హాస్టల్ పేరుతో భారీ భవంతులు కట్టడం వంటి మున్సిపల్ చట్టం ఉల్లంఘనలు బహిరంగంగానే జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రెసిడెన్షియల్ అనుమతులు, కమర్షియల్ దందా..

మున్సిపల్ నిబంధనల ప్రకారం నివాస గృహాల కోసం ఇచ్చిన అనుమతులతోనే కొందరు యజమానులు కమర్షియల్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. హోటల్లు, విద్యాసంస్థలు, హాస్టళ్లు, కార్యాలయాలు పేరుతో పెద్ద ఎత్తున వ్యాపార వినియోగం జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.
అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులు, సెల్లార్లు, స్టిల్ట్ లో వ్యాపారాలుపట్టణ ప్రణాళిక నిబంధనలను తుంగలో తొక్కుతూ అనుమతిలో ఉన్నదానికంటే ఎక్కువ అంతస్తులు నిర్మించడం సాధారణంగా మారిందని ఇందులో టౌన్ ప్లానింగ్ సిబ్బంది అధికారులకు లక్షలలో లంచాలు అందుతున్నాయని స్థానిక ప్రజలు బహిరంగంగా చెబుతున్నాయి. కొన్ని భవనాలు అనుమతికి మించి ఎత్తుకు పెరిగినా, కూల్చివేత చర్యలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అమీర్ పేట సర్కిల్ పరిధిలోని శివ బాగ్, బుద్ధ నగర్, ధరంకరం రోడ్ లలో ఎలాంటి సెట్ బ్యాక్ లు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని,హాస్టల్ పేరుతో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని భారీ భవంతులు కడుతున్నారు.విద్యార్థుల కోసం అని హాస్టల్ నిర్వహణ పేరుతో అమీర్పేట సర్కిల్ పరిధిలో అనేక ప్రాంతాల్లో భారీ కమర్షియల్ తరహా భవంతులు నిర్మిస్తున్నారని సమాచారం. పార్కింగ్, భద్రత, అగ్నిమాపక నిబంధనలు పక్కనపెట్టి అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

### అధికారులపై లంచాల ఆరోపణలు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనిటౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన కొందరు అధికారులు అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బదులు, లంచాలు తీసుకుని కన్నుగప్పుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెక్షన్ ఆఫీసర్ నుంచి ఏసిపి, డిప్యూటీ కమిషనర్ స్థాయి వరకు అక్రమ నిర్మాణాల ద్వారా "కనక వర్షం" కురుస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూఅనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు సాగడం వల్ల అభివృద్ధి ఛార్జీలు, అనుమతులు డబ్బులు ప్రభుత్వానికి చేరకుండా నష్టం వాటిల్లుతోందని నిపుణులు అంటున్నారు. ఇది నగర ప్రణాళికను పూర్తిగా దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### జోనల్ కమిషనర్ల జోక్యం అవసరం..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విచ్చలవిడిగా నిలిచిపోతున్న అక్రమ నిర్మాణాలపై జోనల్ కమిషనర్లు ఉక్కు పాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.అమీర్‌పేట సర్కిల్‌లో జరుగుతున్న చాలా అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైనా అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ అంతస్తుల కూల్చివేత, కమర్షియల్ దుర్వినియోగంపై ఏసీబీ అధికారులచే ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# పరీక్ష రాస్తూ ప్రసవం

- వాష్‌రూంలో బిడ్డకు జన్మనిచ్చిన పదో తరగతి విద్యార్థిని
- మైనర్ బాలిక వాంగ్మూలంతో నిందితుడిపై కేసు నమోదు
- జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



భోపాల్ (ప్రశ్న న్యూస్) మధ్యప్రదేశ్‌లో అత్యంత విస్తుపోయే ఘటన చోటుచేసుకుంది. పదో తరగతి బోర్డు పరీక్ష రాస్తున్న ఓ మైనర్ విద్యార్థిని, పరీక్షా కేంద్రంలోని వాష్‌రూంలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ అనూహ్య సంఘటనతో పరీక్షా కేంద్రంలో తీవ్ర కలకలం రేగింది. ధార్ జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతమైన పిథాంపూర్‌లో మంగళవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే పిథాంపూర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పదో తరగతి గణితం పేపర్ రాస్తున్న విద్యార్థినికి మధ్యలో తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. ఇన్విజిలేటర్ అనుమతితో ఆమె వాష్‌రూంకు వెళ్లింది. అయితే, చాలాసేపటికీ తిరిగి రాకపోవడంతో పాటు లోపలి నుంచి పసికందు ఏడుపు వినిపించడంతో సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. తలుపులు తెరిచి చూడగా, విద్యార్థిని బిడ్డను ప్రసవించి ఉండటం చూసి నిశ్చేష్టులయ్యారు.వెంటనే పరీక్షా కేంద్రం యాజమాన్యం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించింది. తల్లీబిడ్డను హుటాహుటిన స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ ఘటనపై పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాధితురాలు ఇండోర్ జిల్లాలోని బెత్మా ప్రాంతానికి చెందినది కావడంతో కేసును అక్కడి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ధార్ ఏఎస్పీ విజయ్ దబూర్ మీడియాకు వెల్లడించారు. విచారణలో భాగంగా గత రెండేళ్లుగా ఓ యువకుడితో పరిచయం ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. ఆమె వాంగ్మూలం ఆధారంగా నిందితుడిని గుర్తించామని, త్వరలోనే అతడిని అరెస్ట్ చేస్తామని పోలీసులు పేర్కొన్నారు. నిందితుడిపై పోక్సో సహా సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సర్వే నంబర్ 1007లో అక్రమ నిర్మాణాలు ఆపండి



**కూకట్ పల్లి (ప్రశ్న న్యూస్)** అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కూకట్ పల్లి గ్రామ సర్వే నంబర్ 1007 లో గల భూముల్లో కోర్టు కేసులు నమోదయ్యి స్టేటస్ కో ఉత్తర్వులు ఉన్నాయని అయిన కూడా అక్రమంగా నిర్మాణాలను చేపడుతున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మునిసిపల్ కమిషనర్ సృజన ని కలిసి కోరారు. మునిసిపల్ అనుమతులు లేకుండా ఏకంగా షెడ్ లను, హోటళ్లను, టిఫిన్ సెంటర్లను నిర్మిస్తున్నారని, అటు కోర్టు ఉత్తర్వులను ఇటు సీఎంసీ నిబంధలను ఉల్లంఘించి చేపట్టే నిర్మాణాలపై సత్వరం చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరు దళారులు అక్రమాలకు పాల్పడుతూ అటు ప్లాట్ల యజమానుల వద్ద ఇటు వ్యాపారస్తుల వద్ద లక్షల్లో డబ్బులు దండుకొని మున్సిపల్ అధికారులను మేనేజ్ చేసి కూల్చివేతలు చేపట్టకుండా చూస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. కాబట్టి వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## తార్నాక సర్కిల్‌లో రహదారులపై

# అక్రమ నిర్మాణాల జోరు

- నోటీసులు లేవు, కూల్చివేతలు లేవు "సెటిల్మెంట్లే" పరిష్కారమా.?
- సంవత్సరాలుగా అక్రమ నిర్మాణ పనులు జరుగుతున్న పట్టించుకోని సిబ్బంది, అధికారులు
- స్థానికుల ఫిర్యాదులు, పత్రికలో కథనాలు చెత్త బుట్టదాకా లేనా.?
- చర్యలు తీసుకోవడం లేదంటే లంచాలే కారణమా.?




**సీతాఫలమండి (ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని తార్నాక సర్కిల్‌లో రహదారులపై అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా రోడ్లపై షెడ్లు, స్టిల్ట్ లో వ్యాపారాలు, నిర్మించినప్పటికీ అధికారుల నుండి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### నోటీసులు ఇచ్చి చర్యలు ఎందుకు తీసుకోరు.?

సాధారణంగా అక్రమ నిర్మాణాలపై ముందుగా నోటీసులు జారీ చేసి, ఆ తర్వాత కూల్చివేతలు చేపట్టడం మున్సిపల్ శాఖ బాధ్యత. అయితే తార్నాక సర్కిల్ పరిధిలో నోటీసులు జారీ చేయడం లేదని, కూల్చివేతలు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. "అన్నీ సెటిల్మెంట్లే జరుగుతున్నాయి" అనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

### సీతాఫలమండి రహదారిపై అక్రమ నిర్మాణాల పరిస్థితి

సీతాఫలమండి ప్రధాన రహదారిపై నిర్మాణ నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు జరిగినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనంగా ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. సీతాఫలమండి రహదారిపై పక్కింటి నెంబర్ 12-11-1579 నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి సెట్ బ్యాక్ లు లేకుండా అక్రమ సెల్లార్, అక్రమ అంతస్తులతో రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకొని కమర్షియల్ నిర్మాణం చేస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని స్థానికులు అనేకసార్లు ఫిర్యాదు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం వెనక లంచాలే కారణమని స్థానికులు మండిపడుతున్నారు. నిర్మాణాల వల్ల ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. పాదచారులు కూడా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


### ప్రభుత్వ ఆదాయానికి గండి.?

అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరగడం, అదనపు అంతస్తులు నిర్మించడం వంటి చర్యలు మున్సిపల్ నిబంధనలను తుంగలో తొక్కినట్లే అని నిపుణులు అంటున్నారు. ఇంత భారీ అక్రమ నిర్మాణం జరుగుతుంటేఉన్నతాధికారుల జోక్యం అవసరమని తార్నాక సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై పూర్తి స్థాయి విజిలెన్స్, ఏసీబీ విచారణ జరిపి, లంచాలు తీసుకొని అక్రమాన నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల సౌకర్యం, రహదారి భద్రత, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణ కోసం ఉన్నతాధికారులు తక్షణం స్పందించాలని కోరుతున్నారు.

# సీజ్ తీశారు.. సున్నం వేశారు

**- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జిహెచ్ఎంసి చట్టానికి తూట్లు - అధికారులకు సవాల్ విసురుతున్న అక్రమ నిర్మాణదారుడు**




**ముషీరాబాద్ (ప్రశ్న న్యూస్)** కవాడిగూడ సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి అక్రమాలు రాజమేలుతున్నాయి. అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్న మూడునాళ్ళ ముచ్చటగానే మిగులుతున్నాయి. రాజకీయ నాయకుల అండదండతో సీజ్ చేసిన భవనాల సీజ్ తొలగించి యదేచ్ఛగా నిర్మాణ పనులు చేసి రంగులు వేస్తున్న పట్టించుకునే నాధుడే లేకుండా పోయారు. ముందుగానే లంచాలు తీసుకొని అధికారులు మౌనం వహిస్తున్నారని స్థానికుల ఆరోపిస్తున్నారు. సీజ్ చేసిన భవనాలలో యదేచ్ఛగా నిర్మాణ పనులు జరుగుతూ గృహప్రవేశాలు చేసుకుంటూ, వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అంటే అధికారులు అంతర్గత ఒప్పందాలు చేసుకొని జిహెచ్ఎంసి ఆదాయానికి గండి కొట్టడం ఒక వంతు అయితే జిహెచ్ఎంసి నియమనిబంధనలు అంటే ఇంత అలుసా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమంటే అక్రమ నిర్మాణదారులకు లెక్క లేదా దీనిని బట్టి చూస్తే అధికారులు జిహెచ్ఎంసిని పూర్తిగా అబాసు పాలు చేస్తున్నారు. అశోక్ నగర్ రహదారిపై పిల్లర్ నంబర్ పి 22 వద్ద రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని అక్రమ సెల్లార్, అక్రమ అంతస్తులతో భారీ కమర్షియల్ నిర్మాణం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

అధికారులు సీజ్ చేసిన అక్రమ నిర్మాణదారుడు లెక్క చేయలేదంటే స్థానిక మాజీ ప్రజాప్రతినిధుల హస్తం ఉందని, వెంటనే మున్సిపల్ చట్టాన్ని ఉల్లంఘించినందుకు అక్రమ నిర్మాణదారులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చట్టాలు అంటే ప్రతి ఒక్కరు గౌరవించి ఆచరించాలి తప్ప ఇలా ఉల్లంఘించకూడదని అధికారులు కఠినంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588